


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 12, పేజీలు - 08
సోమవారం, జులై 6, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మెట్రో విషయంలో జోక్యం చేసుకోండి

**- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు**



- హైదరాబాద్ మెట్రో స్వాధీనంపై కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- ఫేజ్-1 టేకోవర్, ఫేజ్-2 విస్తరణపై ఎస్బీఐ క్యాప్స్‌తో అధ్యయనం చేయించాలని విజ్ఞప్తి
- ప్రక్రియ ఆలస్యం వల్ల నిర్వహణలో అనిశ్చితి, వ్యయం పెరుగుతుందని ఆందోళన
- జూన్ 24 సమావేశంలో కుదిరిన అంగీకారాన్ని అమలు చేయాలని కోరిన సీఎం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్-1ను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు- గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి విడివిడిగా లేఖలు రాసి పంపారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. గత సమావేశాల నిర్ణయాల ప్రకారం మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించారు. అయితే, ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

2లో..

## రామమందిర విరాళాల దోపిడీకి బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలి

**- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అధికారాన్ని నిలుపుకోవడానికి ఎస్ఐఆర్, డీలిమిటేషన్‌ను వాడుకుంటూ బీజేపీ సర్కార్ 'ఓట్ చోరీ' చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడమే కాకుండా, ఎన్నికల అవకతవకల ద్వారా ప్రజాస్వామ్య సంస్థలను కూడా బలహీనపరుస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ సర్కార్‌పై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. బంగాల్, మహారాష్ట్ర, హరియాణా, అసోం వంటి రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ద్వారా బీజేపీ 'ఓట్ చోరీ'కి పాల్పడిందని ఖర్గే ఆరోపించారు. అధికారంలో కొనసాగడానికి

2లో..

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం సీరియస్

**- మెటాకు ఆఖరి ఛాన్స్!**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వాట్సాప్ కొత్తగా తీసుకొచ్చిన యూజర్ నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పందించింది. ఈ ఫీచర్‌కు సంబంధించి వివరణ ఇవ్వడానికి ఇప్పటికే డెడ్‌లైన్ విధించిన కేంద్రం, ఆ గడువును మరో మూడు రోజులు పొడిగించింది. దాంతో యూజర్ నేమ్ ఫీచర్‌పై జూలై 9 లోపు క్లారిటీ ఇవ్వాలని కేంద్రం మెటాకు స్పష్టం చేసింది. యూజర్ నేమ్ ఫీచర్‌పై ఈ వారం ప్రారంభంలోనే పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రం మెటాకు నోటీసు జారీ చేసింది. మొదటగా జూలై 6లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించగా, ఇప్పుడు ఆ గడువును జూలై 9 వరకు పొడిగించడం విశేషం. ఈ విషయంలో మెటా వాదన ఒకలా ఉంటే కేంద్రం వాదన మరోలా ఉంది.వాట్సాప్ తీసుకురానున్న ఈ కొత్త ఫీచర్‌తో ఇకపై మొబైల్

2లో..

## ఒవైసీ బ్రదర్స్‌కు భయమంటే ఏంటో చూపిస్తాం

**- కేంద్రమంత్రి బండి సంజయ్ స్ట్రాంగ్ వార్నింగ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆయన సోదరులపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. తెలంగాణలోని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతుతోనే ఒవైసీ ధైర్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చివరికి న్యాయవ్యవస్థను కూడా ప్రశ్నించే స్థాయికి

2లో..

## స్థానిక ఎన్నికలు వస్తున్నాయి.. అన్ని చోట్లా గెలవాల్సిందే

**కుప్పం నుంచి సీఎం చంద్రబాబు పిలుపు**



- క్షేత్రస్థాయిలో పొలిటికల్ గవర్నెన్స్ అవసరమన్న చంద్రబాబు
- అధికారులు, పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచన
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలని పిలుపు
- పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు ఉంటాయని స్పష్టీకరణ

అమరావతి (ప్రశ్న న్యూస్) తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మూడో రోజు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కార్యకర్తలు వ్యవహరించాల్సిన తీరుపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. పై స్థాయిలోనే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని, అప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కుప్పంలో పర్యటనలో భాగంగా రైతులు, పీ4 లబ్ధిదారులు, అధికారులతో వరుస భేటీలు నిర్వహించిన అనంతరం, ఆయన నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డితో పాటు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను అధికారులకు వివరించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా

2లో..

## చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కి అప్పజెప్పండి

**- అన్ని జలాశయాలు నింపి చూపిస్తాం**

- కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన కేటీఆర్ బృందం
- పర్యటనను అడ్డుకునేందుకు పోలీసుల యత్నం, చోటుచేసుకున్న ఉద్రిక్తత
- లక్ష క్యూసెక్కుల గోదావరి నీటిని ప్రభుత్వం వృథా చేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- చేతకాకపోతే వారం రోజులు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించాలని సవాల్
- ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము పుట్టకముందు నుంచే పోలవరం ప్రాజెక్టు గురించి వింటున్నామని, కానీ దశాబ్దాలు గడుస్తున్నా అది ఇంకా పూర్తి కాలేదన్నారు. అయితే 2028లో పూర్తి కావొచ్చేమో అన్నారు. ఇందుకు భిన్నంగా తెలంగాణలో కేసీఆర్ కాలంతో పోటీపడి అద్భుతమైన ప్రాజెక్టులను నిర్మించారని కొనియాడారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నేతల బృందం భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్ హౌస్‌కు చేరుకొని పరిశీలించారు.

### పోలవరం ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ 'మా పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు గురించి దశాబ్దాలుగా వింటున్నాం. నాకు ఈ నెలతో 50 ఏళ్లు నిండుతున్నాయి. నేను పుట్టకముందు నుంచే పోలవరం గురించి చర్చలు జరుగుతున్నాయి. 50, 60 ఏళ్ల క్రితం సినిమాల్లో కూడా దీని ప్రస్తావన ఉండేది. పోలవరం అనేది గోదావరికి అడ్డంగా కట్టి డెల్టాకు నీళ్లు తీసుకెళ్లే ఒక గ్రావిటీ ఆధారిత ప్రాజెక్ట్. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాక 2004-05లో దీనికి మళ్లీ పునాది రాయి

2లో..

## చంద్రబాబు హయాంలో పోలీసు వ్యవస్థ ప్రమాదకరంగా మారింది

- రాజకీయ ప్రత్యర్థులను అణచివేసేందుకే ఈ ధోరణి అని ఆరోపణ
- నిజమైన నేరాలను వదిలేసి సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతున్నారని ధ్వజం
- ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని, రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని వ్యాఖ్య



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకరమైన దిశగా పయనిస్తోందని వైసీపీ అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచివేసేందుకు చంద్రబాబు పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా మార్చుకుంటున్నారని, ఇది రాష్ట్రాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. "చంద్రబాబు రాష్ట్రానికి కావాల్సింది

2లో..

## బీఆర్ఎస్ చెప్పింది చేస్తే భద్రాచలం మునిగిపోతుంది

**- కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఇరిగేషన్ శాఖను సర్వనాశనం చేసిందని తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను రైతుల ప్రయోజనాల కోసం కాకుండా కేవలం కమీషన్ల కోసమే నిర్మించిందని ఆరోపించారు. బ్యారేజీలలో నీళ్లు నిల్వ చేస్తే మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోయి భద్రాచలం సహా చుట్టుపక్కల

2లో..

## ముంబైకి రెడ్ అలర్ట్

**- పలు ప్రాంతాల్లో 200 మి.మీ. దాటిన వర్షపాతం**



**ముంబై (ప్రశ్న న్యూస్)** ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో నగరం అతలాకుతలమైంది. దీంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబైకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రానున్న గంటల్లోనూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా

2లో..

## హార్మూజ్ లో ప్రయాణించే నౌకలకు రుసుం

**- మిత్రదేశాలకు ఇరాన్ రాయితీ!**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత

2లో..

# మెట్రో విషయంలో జోక్యం చేసుకోండి

ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాప్యం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయని, అలాగే ఫేజ్-2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని తన లేఖల్లో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. జూన్ నెలలో 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 45 నిమిషాల పాటు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ నిర్ధారణ (వాల్యుయేషన్), స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపికతో పాటు, ఫేజ్-2 విస్తరణకు అయ్యే నిర్మాణ వ్యయం, దీర్ఘకాలిక రుణాల సేకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఒక ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడిగా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ నిర్ణయంతో మెట్రో విస్తరణ, స్వాధీన ప్రక్రియలకు ఉన్న ఆటంకాలు తొలిగిపోయాయి.

# రామమందిర విరాళాల దోపిడీకి బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లే బాధ్యత వహించాలి

కమలం పార్టీ రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. బీజేపీ/ఆర్ఎస్ఎస్ ఓట్లను చోరీ చేస్తున్నాయని దుయ్యబట్టారు. దేవుడి సంపదను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఇటువంటి దుర్వినియోగాన్ని నివారించడానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ఒకే దేశం- ఒకే ఎన్నిక బిల్లు వంటి వాటిని సభ ముందుకు తీసుకురావాలని బీజేపీ చూస్తోందన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆహార భద్రతా చట్టం వంటి సంక్షేమ చర్యలను ఎన్‌డీఏ సర్కార్ బలహీనపరుస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం పరిపాలనపై కాకుండా కేవలం ఎన్నికలపైనే దృష్టి సారిస్తోందని ఎద్దేవా చేశారు.

# స్థానిక ఎన్నికలు వస్తున్నాయి..
## అన్ని చోట్లా గెలవాల్సిందే

చొరవ తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని, వారిని గౌరవించాలని అన్నారు. గత ఐదేళ్ల పాలన (2019-24) రాష్ట్రానికి ఒక పీడకల వంటిదని, ఆ సమయంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతతను దెబ్బతీయాలని నాటి పాలకులు విఫలయత్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ఎవరైనా రౌడీయిజం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానిక సంస్థలన్నింటినీ కూటమే కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, దానికి భంగం కలిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని హితవు పలికారు. పార్టీలో పదవుల కేటాయింపుపై కూడా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, నియామకాల్లో ఎలాంటి మొహమాటాలకు, సిఫారసులకు తావుండదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి, గతంలో కంటే మెరుగైన మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీ కృషి చేస్తుందని, "ఇంటికో పారిశ్రామికవేత్త" విధానాన్ని పార్టీ కార్యకర్తలు కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అందరి ఆమోదంతో త్వరలోనే కుప్పంలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# ఒవైసీ బ్రదర్స్‌కు భయమంటే ఏంటో చూపిస్తాం

వెళ్లారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఫాతిమా కాలేజీ.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని తేలినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలు ఎదుర్కొంటూ హైకోర్టును ప్రశ్నించడం సరికాదని బండి సంజయ్ పేర్కొన్నారు. హైకోర్టు పలుమార్లు అవకాశం ఇచ్చినా ఫాతిమా విద్యాసంస్థలకు సంబంధించిన నివేదికలు, చట్టపరమైన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించలేదని కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిందని బండి సంజయ్ గుర్తుచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారంలో స్పందించకుండా ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు.
గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇతర విద్యాసంస్థలకు అధికారులు వరుస నోటీసులు జారీ చేస్తున్నారని అదే సమయంలో ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఒకరికి ఒక చట్టం, మిగతా వారందరికీ మరో చట్టమా అని ప్రశ్నించారు. ఫాతిమా విద్యాసంస్థలపై గతంలో దర్యాప్తు సంస్థలు కొన్ని అంశాలను గుర్తించాయని పేర్కొన్న బండి సంజయ్ విద్యాసంస్థల కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆరోపణలకు సమాధానం చెప్పకుండా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని చట్టానికి అందరూ సమానంగా లోబడి ఉండాలని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అక్రమంగా నిర్మించిన ఫాతిమా విద్యాసంస్థలను కూల్చివేస్తామని బండి సంజయ్ తేల్చి చెప్పారు. అదే సమయంలో ఫాతిమా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అక్రమాలకు పాల్పడిన వారికి భయమంటే ఏంటో చూపిస్తామని ఓవైసీ బ్రదర్స్‌ను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం సీరియస్

నెంబర్‌తో పనిలేకుండా కేవలం యూజర్ నేమ్‌తోనే ఇతరులతో చాట్ చేసుకోవచ్చు. మెటా చెప్పిన దాని ప్రకారం డిస్‌ప్లే నేమ్‌కు, యూజర్ నేమ్‌కు తేడా ఉంటుంది. వాట్సాప్‌లో మనకు కనిపించే డిస్‌ప్లే నేమ్ ఒకే పేరుతో చాలా మంది పెట్టుకోవచ్చు. కానీ, యూజర్ నేమ్ మాత్రం ప్రతి అకౌంట్‌కు ఒక్కటే ఉంటుంది.

అయితే, వాట్సాప్ తీసుకురానున్న ఈ కొత్త ఫీచర్‌పై కేంద్రం భయాందోళన వ్యక్తం చేస్తోంది. ఎందుకంటే ఈ ఫీచర్‌తో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి, సైబర్ నేరాలకు పాల్పడే అవకాశాలు పెరుగుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై వాట్సాప్ స్పష్టత ఇస్తే తప్పించి భారతదేశంలో యూజర్‌నేమ్ ఫీచర్‌ను అమలు చేసే అవకాశం లేదు.

యూజర్ నేమ్ ఫీచర్‌తో జరిగే నష్టాన్ని టెలికాం శాఖకు చెందిన ఓ అధికారి కూడా ఒక ఉదాహరణతో వివరించారు. కొత్త ఫీచర్ ద్వారా ఎవరైనా విదేశీ నెంబర్‌తో వాట్సాప్ ఖాతా సృష్టించి, ప్రముఖుల ఫొటోలు, పేర్లను ఉపయోగించి ఫేక్ కాల్స్ చేసే అవకాశం ఉందన్నారు. అమెరికా కోడ్ o1తో వాట్సాప్ అకౌంట్ క్రియేట్ చేసి ఎన్ఐఏ చీఫ్ ఫొటో, దానికి దగ్గరగా ఉండే యూజర్ నేమ్ పెట్టుకుని ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు o91 నంబర్ కనిపిస్తే కనీసం దర్యాప్తు ప్రారంభించే అవకాశం ఉండేదని, కానీ ఫోన్ నంబర్ కనిపించకపోతే నిందితుడిని గుర్తించడం చట్ట అమలు సంస్థలకు మరింత కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్ వినియోగదారుల ప్రైవసీని పెంచే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో నకిలీ గుర్తింపులు, మోసాలు, సైబర్ నేరాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెటా ఇచ్చే వివరణను పరిశీలించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# చంద్రబాబు హయాంలో పోలీసు వ్యవస్థ ప్రమాదకరంగా మారింది

'రౌడీ పోలీసింగ్' కానీ, 'జంగిల్ రాజ్' కానీ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పరిపాలన, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, చట్టం ముందు అందరూ సమానమే అని విశ్వసించే సమాజం కావాలి. రాజకీయ ఆదేశాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేసే పోలీసు వ్యవస్థ మనకు అవసరం" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో రాష్ట్రవ్యాప్తంగా విష బీజాలు నాటారని, అవి క్రమంగా మొలకెత్తి విష వృక్షాలుగా మారుతున్నాయని జగన్ అభివర్ణించారు. పోలీసుల పనితీరును ప్రశ్నిస్తూ జగన్ పలు ఘటనలను ఉదహరించారు. "పిల్లలు కనపించకుండా పోతే దర్యాప్తులో వేగం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. గిరిజన మహిళను వివస్త్రను చేసి కొట్టినా అరెస్టులు జరగవు. కానీ, సోషల్ మీడియాలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, నాన్-బెయిలబుల్ సెక్షన్లు ప్రయోగించడం వంటివి చేస్తారా?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసు, పెద్దాపురంలో మానసిక వికలాంగురాలిపై జరిగిన లైంగిక దాడి కేసు నమోదులో జాప్యం, నెల్లూరు జిల్లాలో మాజీ టీడీపీ కౌన్సిలర్ ఒక గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన ప్రస్తావించారు. సాయి కృష్ణ కస్టడీ మరణం, అతని మృతదేహం అదృశ్యం కావడం రాష్ట్రాన్ని కుదుపునకు గురిచేసిందని, అతని తల్లి అడిగే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదని అన్నారు. క్రాంతి కుమార్ ఆత్మహత్య, అతను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దాన్ని ప్రజలు సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా చూడటం తీవ్రంగా కలచివేసిందన్నారు. గంగమ్మ, తిరుపతమ్మ కస్టడీ మరణాలు, పోలీసు వేధింపుల కారణంగా కళావతి ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు తీవ్ర అప్రతిష్టను తెచ్చిపెట్టాయని, అయినా మీ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఈ పంథాను ఎంచుకున్నారని జగన్ ఆరోపించారు. సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించి సోషల్ మీడియా కార్యకర్తలపై నాన్-బెయిలబుల్ సెక్షన్లు పెట్టించి, వారి కేసులను వ్యవస్థీకృత నేరాలతో ముడిపెడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెచ్చరించారు. "ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుంది" అని జగన్ తెలిపారు. యూట్యూబర్, జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ అయిన కేవీఆర్‌ను ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా భారీ పోలీసు బలగంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి, అతను చేయని నేరాలకు ఎఫ్ఐఆర్‌లో ఇరికించి జైల్లో పెట్టడం అత్యంత దారుణమని జగన్ ఖండించారు. మరో యూట్యూబర్ రావణ్ విషయంలో నాలుగు వేర్వేరు కోర్టులు బెయిల్ మంజూరు చేసినా, విపరీతమైన అహంకారంతో మీ అనుచరులు నేరుగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, పోలీసులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారని ఆరోపించారు. "చంద్రబాబు గతంలో మీరు, పవన్ కల్యాణ్, లోకేశ్, మీ పార్టీ నాయకులు ఉపయోగించిన పదాలు, అడిగిన ప్రశ్నలనే ఇప్పుడు ఈ వ్యక్తులు అడుగుతున్నారు. ఆ లెక్కన మీ మీద కూడా అవే కేసులు పెట్టాలి కదా? విమర్శించే వారిని నేరస్థులుగా చిత్రీకరించడం, చంపాలనే ఉద్దేశంతో పోలీస్ స్టేషన్లపై మీ వాళ్లను పంపడం, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతాలు. ఇది రాజ్యాంగ హక్కులపై దాడి, ప్రజాస్వామ్య విలువలపై దాడి" అని జగన్ ఉద్ఘాటించారు.

# బీఆర్ఎస్ చెప్పింది చేస్తే భద్రాచలం మునిగిపోతుంది

పలు గ్రామాలు మునిగిపోతాయని ఇంజనీర్లు చెప్పారని గుర్తుచేశారు. కేవలం మీదనే కాదు, మన పిల్లలపై సైతం అధిక వడ్డీల బారం మోపిన పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు.

## ప్రాజెక్టులపై బీఆర్ఎస్ 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా లాభం లేదు

సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టుల పేరిట రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేసింది, కట్టింది, అది కూలింది కూడా బీఆర్ఎస్ హయాంలోనేనని లక్ష కోట్ల ప్రజాధనాన్ని నాశనం చేసి ఇప్పుడు ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కక్కుర్తి, ప్రాజెక్టు నిర్మాణంలో చారిత్రక తప్పిదాల వల్లే నేడు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు పూర్తిగా పనికిరాకుండా పోయాయని ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదికల ప్రకారం ఈ 3 బ్యారేజీల్లో నీటిని అస్సలు నిల్వ చేయవద్దని నిపుణులు స్పష్టం చేశారని మంత్రి తెలిపారు. బ్యారేజీల ఫౌండేషన్‌లో తీవ్రమైన సాంకేతిక లోపాలు ఉన్నాయని, ఒకవేళ మొండిగా నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ బ్యారేజ్ కొట్టుకుపోవడమే కాకుండా, భద్రాచలం పట్టణంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయని ఇంజనీర్లు హెచ్చరించినట్లు వెల్లడించారు. ఎక్కువ ఖర్చు చూపిస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయనే దురాశతోనే ఆనాడు ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని ఆరోపించారు.

## సరిగ్గా నిర్మించింటే కాళేశ్వరం వాడుకునేవాళ్లం..

ఆనాడు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై రూ. 11వేల కోట్లు ఖర్చు చేశాక రీడిజైనింగ్ పేరిట మార్చారని, అలా రీడిజైన్ చేసిన కొత్త ప్రాజెక్టుకు రూ. 1.20 లక్షల కోట్లు అవసరమని కాగ్ ఆనాడే హెచ్చరించిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును గనుక సరిగ్గా నిర్మించి ఉంటే, దానిని వినియోగించుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కానీ ప్రస్తుతం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు కిందకు దించే పరిస్థితి లేదని గేట్లు కిందకు దింపి నీరు నిల్వ చేయకుండా మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం సైతం అసాధ్యమని వివరించారు.

# హర్మూజ్ లో ప్రయాణించే నౌకలకు రుసుం

ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దొల్‌రెజా రహ్మానీ ఫజ్లీ శనివారం బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కొత్త ఏర్పాట్ల కోసం ఒమన్‌తో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. "హర్మూజ్ మా ప్రాదేశిక జలాల్లో భాగం కాబట్టి, మేము కచ్చితంగా సేవా రుసుములను వసూలు చేస్తాం" అని ఆయన అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన యుద్ధం తర్వాత ఇరు దేశాల మధ్య సయోధ్య కుదిరింది. ఇందులో భాగంగా 60 రోజుల పాటు హర్మూజ్ జలసంధిలో నౌకల ఉచిత ప్రయాణానికి జూన్ మధ్యలో ఒప్పందం కుదిరింది. అయితే, ఈ జలసంధిలో ఎలాంటి రుసుములను అంగీకరించబోమని, అంతర్జాతీయ నౌకాయానానికి స్వేచ్ఛగా అందుబాటులో ఉండాలని అమెరికా వాదిస్తోంది. యుద్ధ సమయంలో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి ధరలు పెరిగాయి. కాల్పుల విరమణ తర్వాత రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఇరాన్ తాజా నిర్ణయం ప్రపంచ షిప్పింగ్ ఖర్చులు, చమురు ధరలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ముంబైకి రెడ్ అలర్ట్

వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విక్రోలి వెస్ట్‌లో 310.6 మి.మీ. వర్షం కురవగా, కొలాబా పంపింగ్ స్టేషన్ వద్ద 306.6 మి.మీ., టాగోర్ నగర్‌లో 301.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

పలుచోట్ల ఇళ్లు కూలగా, చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లు, రైల్వే ట్రాక్‌లపైకి నీరు చేరడంతో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబర్బన్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రజలను అప్రమత్తం చేసింది. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించింది. సహాయం కోసం 1916 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపింది.

ఆదివారం మధ్యాహ్నం 3:22 గంటలకు సముద్రంలో 4.19 మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. థానే, నవీ ముంబై, పాల్ఘర్ వంటి సమీప ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

# వామ్మో పులి.. ఇంట్లోకి చొరబడుతుంటే కేకలు వేసిన కుటుంబసభ్యులు..

వన్యప్రాణులు జనవాసాల్లోకి చేరి అందరినీ భయబ్రాంతులకు గురిచేయడం ఎప్పుడూ ఎక్కడో చోట జరుగుతూనే ఉంటుందని తెలిసిందే. అలాంటి ఘటన ఒకటి ఏపీలో కలకలం రేపింది. చిరుత పులి ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించింది.

ఈ ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో వెలుగుచూసింది. అటవీ ప్రాంతంలో నుంచి వచ్చిన చిరుత పులి వెంకటాపురం గ్రామంలోని లెక్చరర్ బాలాజీ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించింది.. అయితే పులిని చూసిన బాలాజీ కుటుంబసభ్యులు భయంతో కేకలు వేశారు

. దీంతో ఆ చిరుత భయంతో అక్కడి నుంచి పారిపోయింది. చిరుత పారిపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. చిరుతపులి సంచారంతో భయాందోళనలో ఉన్న స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులు పులిని బంధించాలని డిమాండ్ చేస్తున్నారు. చిరుతపులికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

# చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కి అప్పజెప్పండి

పడింది. ఇప్పటికి 21, 22 ఏళ్లు అవుతున్నా ఆ ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు.

## కేసీఆర్ నాయకత్వ పటిమతో ప్రాజెక్టులు పూర్తి

ఆంధ్రా ప్రాజెక్టులతో పోలిస్తే తెలంగాణలో కేసీఆర్ నాయకత్వం, ఇక్కడి ప్రజలపై ఆయనకున్న కమిట్‌మెంట్ పూర్తిగా భిన్నమైనది. కేసీఆర్ కాలంతో పోటీ పడుతూ, ఎండకాలంలో సైతం నీళ్లు దొరికే అత్యుత్తమమైన పాయింట్‌ను ఎంచుకుని ప్రాజెక్టులను నిర్మించారు. కాళేశ్వరం సాధారణ గ్రావిటీ ప్రాజెక్ట్ కాదని, 80 మీటర్ల నుంచి ఏకంగా 620 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా భారీ 'బాహుబలి' మోటార్లను పెట్టి అద్భుతాలు చేశాం. గోదావరి, ప్రాణహిత కలిసిన తర్వాత, కరువు కాలంలోనూ నీరు పుష్కలంగా ఉండే ప్రాంతాన్ని గుర్తించి మరీ ఈ ప్రాజెక్టుకు పునాది వేసి, విజయవంతంగా పూర్తి చేశామని' కేటీఆర్ స్పష్టం చేశారు.

## కన్నెపల్లి పంప్ హౌస్‌ను పరిశీలించిన కేటీఆర్ బృందం

'కాంగ్రెస్ సర్కార్ ఎన్నో అడ్డంకులు సృష్టించి, తమ పర్యటనను అడ్డుకోవాలని చూసినా వాటన్నిటినీ అధిగమించి ఇక్కడి చేరుకున్నాం. హైదరాబాద్ నుంచి కన్నెపల్లికి చేరుకునేందుకు సాధారణంగా 4 గంటలు పడుతుందని, కానీ పెంబర్తి, జనగామ, ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, కాటారం, మహదేవ్‌పూర్‌లో అడుగడుగునా పోలీసులు తమ్మల్ని అడ్డుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల నుండి ఆదేశాలు ఉన్నాయంటూ పోలీసులు వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, తాము ఇక్కడికి రాజకీయ కక్ష తీర్చుకునేందుకు రాలేదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా నీళ్ల కోసం పోరాటాలు కొనసాగాయని, తెలంగాణ భౌగోళికంగా గోదావరి, కృష్ణా నదులు కింద పారుతుంటే భూములు పైనున్నాయి. అందువల్ల లిఫ్ట్ ద్వారా మాత్రమే నీటిని తరలించే బృహత్తర ప్రణాళికను కేసీఆర్ ప్రభుత్వం చేసిందని' కేటీఆర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ చేతకానితనంతో వృథాగా సముద్రంలోకి గోదావరి జలాలు

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఎత్తుపై గతంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అభ్యంతరాల నేపథ్యంలో, ఎంతటి కరువులోనైనా నీటి లభ్యత ఉండే మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలని అధికారులు సూచించారని కేటీఆర్ తెలిపారు. ఐదు దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని, కానీ తాము మూడున్నరేళ్ల కాలంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అయిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని చెప్పారు. కాళేశ్వరం అంటే కేవలం ఒక బ్యారేజీ కాదని, అది 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపుహౌస్‌లు, 1531 కి.మీ. కాల్వల సమాహారమని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీలో కేవలం 2 పిల్లర్లు కుంగితే, దానికి రూ. 400 కోట్లతో రిపేర్ చేయడానికి ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కాళేశ్వరం కూలేశ్వరమైందని కాంగ్రెస్ నాయకులు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని, ప్రస్తుతం మేడిగడ్డతో అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని తరలించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పంపులు ఆన్ చేయడం లేదని, దీనివల్ల 98 వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కాళేశ్వరంతోనే మారిన రైతుల బతుకులు, పెరిగిన పంటలు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొత్తగా 40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడిందని, ఎస్ఆర్ఎస్పీలో నీళ్లు లేకుంటే రివర్స్ పంపింగ్ ద్వారా నింపుకోవచ్చని కేటీఆర్ పేర్కొన్నారు. 7 జిల్లాలకు సాగు, తాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ కాళ్లు నరికేసి పడావు పెట్టడం వల్లే ఇవాళ హైదరాబాద్‌లో తాగునీటి కోసం 15 వేల వాటర్ ట్యాంకర్లు పెరిగాయని విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణానికి మొత్తం రూ. 94 వేల కోట్లు ఖర్చయితే, కాంగ్రెస్ నాయకులు లక్ష కోట్ల అవినీతి జరిగిందని అబద్ధాలు చెప్తున్నారని, సీఎం రేవంత్‌కు సోయి, ఉత్తమ్‌కు స్పృహ లేదని ఎద్దేవా చేశారు. 2014 కంటే ముందు రికార్డు స్థాయిలో పంటలు ఎందుకు పండలేదో చెప్పాలని డిమాండ్ చేస్తూ, కాళేశ్వరం వచ్చాకే సూర్యాపేట లాంటి జిల్లాలకు నీళ్లొచ్చాయని, పంజాబ్‌ను తలదన్ని వరి ధాన్యంలో తెలంగాణ నెంబర్ వన్ కావడానికి, రైతుల ఆత్మహత్యలు తగ్గడానికి కాళేశ్వరం ప్రాజెక్టే కారణమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# భారత శాస్త్రవేత్తల ఘనత

**-ఐఐటీ బాంబే, ఐసీఎంఆర్ పరిశోధకుల కీలక ఆవిష్కరణ**
**-ప్రయోగశాలలో 'ప్లాసెంటా ఆన్ చిప్' రూపకల్పన**
**-గర్భిణులకు ఇచ్చే మందుల భద్రతపై అధ్యయనానికి మార్గం సుగమం**

**- ప్రయోగశాలలో కృత్రిమ 'మాయ' సృష్టి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత వైద్య పరిశోధన రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఐఐటీ బాంబే పరిశోధకులు, ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఉమెన్స్ హెల్త్ సహకారంతో దేశీయంగా "ప్లాసెంటా ఆన్ చిప్" అనే పరికరాన్ని విజయవంతంగా అభివృద్ధి చేశారు. గర్భధారణ సమయంలో తల్లికి, గర్భస్థ శిశువుకు మధ్య వారధిగా పనిచేసే మానవ మాయ (ప్లాసెంటా) పనితీరును ఇది ప్రయోగశాలలో అనుకరిస్తుంది. ఈ సూక్ష్మ పరికరం నిర్మాణం చాలా సరళంగా ఉంటుంది. ఇందులో రెండు గదుల వంటి నిర్మాణం ఉండి, మధ్యలో ఒక పొర ఉంటుంది. ఒకవైపు మానవ మాయ కణాలను, మరోవైపు రక్తనాళాల కణాలను పెంచుతారు. దీని ద్వారా తల్లి నుంచి బిడ్డకు పోషకాలు, ఆక్సిజన్ ఎలా వెళ్తాయో, వ్యర్థాలు ఎలా బయటకు వస్తాయో అధ్యయనం చేయవచ్చు. హార్మోన్ల ఉత్పత్తి, ఔషధాల రవాణా వంటి కీలక ప్రక్రియలను ఈ పరికరం విజయవంతంగా నమూనా చేయగలిగింది. గర్భధారణ సమయంలో మాయపై నేరుగా పరిశోధనలు చేయడం నైతికంగా, భౌతికంగా చాలా కష్టం. ఈ నేపథ్యంలో, జంతువులపై ప్రయోగాలకు బదులుగా మానవ సంబంధిత నమూనాతో అధ్యయనం చేసేందుకు ఈ ఆవిష్కరణ ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భిణులకు ఇచ్చే మందులు గర్భస్థ శిశువుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ముందుగానే అంచనా వేయడానికి, తద్వారా సురక్షితమైన చికిత్సలు అందించడానికి ఇది దోహదపడుతుంది. గర్భధారణలో ఎదురయ్యే సమస్యలపై లోతైన పరిశోధనలకు కూడా మార్గం సుగమం చేస్తుంది. ఐఐటీ బాంబేకి చెందిన ప్రొఫెసర్ అభిజిత్ మజుందార్, ఐసీఎంఆర్-ఎన్ఐఆర్‌డబ్ల్యూహెచ్‌కు చెందిన ప్రొఫెసర్ దీపక్ మోదీ ఈ పరిశోధనకు నేతృత్వం వహించారు. ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'బయోఫ్యాబ్రికేషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## వామ్మో పులి.. ఇంట్లోకి చొరబడుతుంటే

# కేకలు వేసిన కుటుంబసభ్యులు..



వన్యప్రాణులు జనవాసాల్లోకి చేరి అందరినీ భయభ్రాంతులకు గురిచేయడం ఎప్పుడూ ఎక్కడో చోట జరుగుతూనే ఉంటుందని తెలిసిందే. అలాంటి ఘటన ఒకటి ఏపీలో కలకలం రేపింది. చిరుత పులి ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించింది.. ఈ ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో వెలుగుచూసింది. అటవీ ప్రాంతంలో నుంచి వచ్చిన చిరుత పులి వెంకటాపురం గ్రామంలోని లెక్చరర్ బాలాజీ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించింది.. అయితే పులిని చూసిన బాలాజీ కుటుంబసభ్యులు భయంతో కేకలు వేశారు. దీంతో ఆ చిరుత భయంతో అక్కడి నుంచి పారిపోయింది. చిరుత పారిపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. చిరుతపులి సంచారంతో భయాందోళనలో ఉన్న స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులు పులిని బంధించాలని డిమాండ్ చేస్తున్నారు. చిరుతపులికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

## ఫోన్ టార్చ్ వెలుగులో

# ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్..



బెంగళూరు: రాత్రి వేళ ప్రయాణంలో ఆర్టీసీ బస్సు హెడ్‌లైట్లు పనిచేయలేదు. రోడ్డుపై చీకటిగా ఉండటంతో డ్రైవర్ ఇబ్బంది పడ్డాడు. దీంతో కండక్టర్ మొబైల్ ఫోన్‌లోని టార్జ లైట్ చూపించడంతో ఆ వెలుగులో బస్సు నడిపాడు. (Karnataka RTC Bus) కర్ణాటక ఆర్టీసీ బస్సుల దుస్థితికి అద్దం పట్టే ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ (కేకేఆర్టీసీ) బస్సు కలబురిగి నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న చించోలి పట్టణానికి బయలుదేరింది. ఆ బస్సు చివరి సర్వీసు సమయంలో రాత్రి వేళ హెడ్‌లైట్స్ పని చేయలేదు. కాగా, ఆ రోడ్డు మార్గం పూర్తి చీకటిగా ఉండటంతో బస్సు నడిపేందుకు డ్రైవర్ ఇబ్బంది పడ్డాడు. ఈ నేపథ్యంలో కండక్టర్ తన మొబైల్ ఫోన్‌లోని టార్చ్ వెలుగులో రోడ్డు మార్గాన్ని చూపించాడు. దీంతో ఆ డ్రైవర్ బస్సు నడిపాడు. ఈ సందర్భంగా ఆ బస్సులోని ప్రయాణికులు కొంత ఆందోళన చెందారు. ఒక ప్రయాణికుడు రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కర్ణాటక ఆర్టీసీ బస్సుల దుస్థితిపై విమర్శలు వెల్లువెత్తాయి.

## గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలను

# సందర్శించిన జోనల్ అధికారిణి



కారేపల్లి : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని కవిత ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను(ఇల్లందు) ఆదివారం భద్రాద్రి జోనల్ అధికారి పోతుల అపర్ణ సందర్శించారు. ముందుగా వంటశాలకు వెళ్లి నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులకు అందజేస్తున్న మెనూను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల సబ్జెక్టుల వారిగా ప్రతిభను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు,వసతి గృహాల నిర్వహణను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం సమయానికి అందుతుందో లేదో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూపులలో తక్షణ ప్రవేశాలను కల్పించేందుకు సోమవారం ఖమ్మం జిల్లా తిరుమలయపాలెంలో బాలురకు, టేకులపల్లిలో బాలికలకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో బాలురకు, ములకలపల్లిలో బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురుకుల సంక్షేమ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అన్నారు. విద్యార్థులకి ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతులు, నాణ్యత ప్రమాణాలను పాటిస్తుందన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపల్ వాణి, వైస్ ప్రిన్సిపల్ రత్నలత, బోధన బోధనేతర సిబ్బంది ఉన్నారు.

## పోలీసుల అదుపులో

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



తాండూర్ : ప్రతిపక్షాల పర్యటనలను చూసి భయపడుతున్న ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాండూర్ మండలంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ సతీష్, బీఆర్ఎస్ నాయకుడు క్రాంతికుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఆదివారం అరెస్టు చేసి మాదారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి , బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దార్శనికతతో, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను అడ్డుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. ముందస్తు అరెస్టులతో గొంతునొక్కాలని చూడటం వారి నిరంకుశ పాలనకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పోలీసుల నిర్బంధాలతో, అక్రమ అరెస్టులతో ప్రభుత్వం కాలం వెళ్లదీయాలని చూస్తోందని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ, నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# పెద్దపల్లిలో బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



పెద్దపల్లి కమాన్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు వస్తున్న నేపథ్యంలో, అక్కడికి వెళ్లకుండా పెద్దపల్లి లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియ జేసేందుకు వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికలల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో మోబిన్, పెంచాల శ్రీధర్, వెన్నం రవీందర్, రెవెల్లి స్వామి, బేక్కం ప్రశాంత్, దిలీప్ కాత్రి తదితరులు ఉన్నారు.

## ముంబైలో వర్షాలకు మరో ప్రాణం బలి..

# షాపుపై చెట్టు కూలి ఒకరు మృతి



ముంబై: మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని ముంబైలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం మరో మరణం నమోదైంది. చెట్టు కూలడంతో ఒక వ్యక్తి చనిపోయాడు. ముంబైలోని కుర్లా వెస్ట్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం 12:40 గంటల సమయంలో వర్షాలు, గాలులకు నౌపాడాలో ఒక చెట్టు కూలింది. 63 ఏళ్ల యూనస్‌పై ఆ చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు కొమ్మల కింద చిక్కుకున్న ఆయనను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే యూనస్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, యూనస్ ఇటీవల ఆ ప్రాంతంలో ఒక షాపు కొనుగోలు చేశాడు. దానిని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం ఆ షాపు వద్దకు వచ్చి పరిశీలిస్తున్న ఆయనపై చెట్టు కూలడంతో మరణించాడు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు ముంబైలో భారీ వర్షాలకు ఇప్పటి వరకు నలుగురు మరణించారు. అలాగే బలమైన గాలులకు పలు చెట్లు విరిగాయి. బాంద్రా ఈస్ట్‌లో బలమైన గాలులు, భారీ వర్షాల కారణంగా మరో చెట్టు కూలింది. దీంతో అక్కడ పార్క్ చేసిన పలు వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. బీఎంసీ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కూలిన చెట్టు కొమ్మలు నరికి తొలగించే చర్యలు చేపట్టారు.

# పెళ్లైన మూడు నెలలకే వివాహిత మృతి..

## అత్తారింటి వేధింపులే కారణమన్న యువతి తల్లిదండ్రులు



దేశరాజధాని ఢిల్లీ పరిధిలో ఒక నవ వధువు అనుమానాస్పదంగా మరణించింది. పెళ్లై మూడు నెలలు కూడా కాకముందే ఆ యువతి బిల్డింగ్ మూడో ఫ్లోర్ నుంచి కిందపడి మరణించింది. ఈ ఘటన ఢిల్లీలోని లోధి కాలని, ఎన్ఎండీసీ రెసిడెన్షియనల్ కాంప్లెక్స్, బి బ్లాక్ పరిధిలో శనివారం జరిగింది. అయితే, అత్తవారింటి వేధింపుల వల్లే ఆమె మరణించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకృతి అనే 28 ఏళ్ల మహిళకు గత ఏప్రిల్ 24న పెళ్లైంది. అయితే, పెళ్లైనప్పటి నుంచి భర్త, అత్తవారింట్లో కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసినట్లు ఆకృతి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వారి ఫ్లాట్స్‌లోని మూడో అంతస్తునుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిందని ఆకృతి అత్తామామలు అంటున్నారు. మూడో అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన ఆకృతిని ఢిల్లీలోని ఎయిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అయితే, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని భర్త, అతడి కుటుంబ సభ్యులు అంటున్నారు. కానీ, వరకట్న వేధింపుల వల్లే ఆమె మరణించిందని ఆకృతి సోదరుడు ఆరోపించాడు. వారే ఆకృతిని హత్య చేశారని తెలిపారు. భర్త, అతడి కుటుంబం కలిసి ఆకృతిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్తవారింటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భర్త కుటుంబం ఆకృతిపై గతంలో భౌతిక దాడి కూడా చేసిందని వివరించారు. నిబంధనలకు అనుగుణంగా అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. ఆకృతి బంధువులతోపాటు, ప్రత్యక్ష సాక్షులు అందరినీ విచారిస్తామన్నారు.

## అలాంటి మనిషిని మనుషుల జాబితాలో చేర్చలేం..

## మాజీ సీఎం జగన్‌పై ఏపీ మంత్రి తీవ్ర విమర్శలు..!




ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదన ‘మావిగన్’ పై ఆ రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన మాటలు నిలకడలేకుండా ఉన్నాయని, వాటిని పిచ్చెక్కిన మాటలు అంటారని ఆమె వ్యాఖ్యానించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె.. జగన్ తీరుపై ఘాటుగా స్పందించారు. తల్లిని, చెల్లిని గెంటేసి.. సొంత చిన్నాన్న హత్య కేసులోని నిందితులపై చర్యలు తీసుకోని వ్యక్తిని మనుషుల జాబితాలో చేర్చలేమని అన్నారు. విశాఖను రాజధాని అని చెప్పి ఎన్నికలకు వెళితే ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలే ఓట్లు వేయలేదని సంధ్యారాణి ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి జగన్ మాటలను ప్రజలు ఎంతమాత్రం నమ్మడం లేదనే విషయం స్పష్టమైందని ఆమె తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన బొత్స, ధర్మాన వంటి సీనియర్ నేతలు పార్టీలో ఉన్నప్పటికీ, జగన్ నిలకడలేని మాటల వల్ల జరిగే నష్టాన్ని ఎందుకు వివరించలేకపోతున్నారని ఆమె ప్రశ్నించారు. జగన్ తన పేరులో గన్ ఉన్నట్టే రాజధాని పేరులోనూ గన్‌లు, గొడ్డళ్లు ఉండాలనుకుంటున్నాడని, ఆయనకు మానవ సంబంధాలతో పనిలేదని మంత్రి సంధ్యారాణి ఆరోపించారు. ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే వచ్చినా జగన్‌కు బుద్ధి రాలేదని, ఇదే మేనిఫెస్టోతో మళ్లీ ప్రజల ముందుకు వెళితే ఆ 11 సీట్లు కూడా మిగలవని ఆమె జోస్యం చెప్పారు.

## ఊడిపడిన ఆసుపత్రి స్లాబ్ పెచ్చులు..

# రోగికి తప్పిన ముప్పు



ముంబై: ప్రభుత్వ ఆసుపత్రి భవనం స్లాబ్ నుంచి పెచ్చులు ఊడాయి. ఒక రోగి ఉన్న బెడ్‌పై అవి పడ్డాయి. అయితే ఆ రోగికి తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు ఆ వార్డుకు చేరుకుని పరిశీలించారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఈ సంఘన జరిగింది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఒక వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడాయి. ఒక రోగి బెడ్‌పై ఆ శిథిలాలు పడ్డాయి. అయితే తృటిలో ఆ రోగి తప్పించుకోవడంతో పెద్ద గాయాలు కాలేదు. వెంటనే ఆ రోగిని మరో బెడ్‌కు మార్చారు. కాగా, ఇది చూసి ఆ వార్డులోని ఇతర రోగులు, వారి సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు ఆ వార్డుకు చేరుకుని పరిశీలించారు. స్లాబ్‌లో చిన్న భాగం మాత్రమే కూలిందని, రోగికి ఎలాంటి తీవ్ర గాయాలు కాలేదని తెలిపారు. ఆ ప్రభుత్వ ఆసుపత్రి భవనం పాతదని చెప్పారు. దాని సామర్థ్యంపై తనిఖీ జరిగిందని, మరమ్మతు పనులు చేపడతామని వివరించారు. మరోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆ ప్రభుత్వ ఆసుపత్రి బిల్డింగ్‌లోకి వర్షం నీరు చేరింది. దీంతో పలు వార్డులు జలమయం కావడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందిపడ్డారు. తాజాగా స్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో ఆ ఆసుపత్రి భవనం పరిస్థితి, నిర్వహణ తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# నటుడు ప్రకాశ్‌రాజ్‌ను

## వెంటనే అరెస్ట్ చేయాలి : బీజేపీ నేత




నటుడు ప్రకాశ్‌రాజ్ ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై కొందరు ‘కాలకేయులు’ తరహాలో దాడులు చేస్తున్నారని విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు విష్ణువర్ధన్ రెడ్డి సోషల్ మీడియా లో స్పందించారు. ‘కొంతమంది హిందూ ధర్మం, శ్రీరాముడు, సీతాదేవిపై అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు’ అని విమర్శించారు. తెలంగాణ కేంద్రంగా ఏపీకి వ్యతిరేకంగా ఈ కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ తొలగించండి..

# మెటాకు కేంద్రం నోటీసులు




పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్‌పై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కంటెంట్ వెంటనే తొలగించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ మెటాకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు.. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ ఆదివారం నోటీసులు జారీ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దాడిని ప్రోత్సహించేలా అభ్యంతరకర పెయిడ్ యాడ్స్ వస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. ఈ తరహా యాడ్స్‌ను, కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశాలిచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లల గురించి ప్రసారమవుతున్న అభ్యంతరకర యాడ్స్‌పై ఇటీవల బీబీసీ ఒక కథనం ప్రచురించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ.. మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఈ శాఖ ఆదివారం మెటాకు నోటీసులు ఇచ్చింది. ఈ యాడ్స్‌ను కట్టడి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని సూచించింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఎలాంటి విధానాలు పాటిస్తారో చెప్పాలని ఆదేశించింది. ఇలాంటి అసభ్యకర కంటెంట్‌ను ఎలా అనుమతించారని ప్రశ్నించింది.

అలాగే, మెటా ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకుంటే సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా అసభ్యకర కంటెంట్ ప్రసారమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యాప్‌లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, చట్ట వ్యతిరేక, పిల్లలపై లైంగిక చర్యలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రమోట్ చేస్తున్నారనే విమర్శ ఎప్పటినుంచో ఉంది. బీబీసీ కథనాలతో ఈ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌పై వచ్చే పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర యాడ్స్‌పై క్లిక్ చేస్తూ అది టెలిగ్రామ్‌లోకి ఓపెన్ అవుతుంది. అక్కడికి వెళ్తే రూ.99కే అభ్యంతరకర కంటెంట్ అంటూ వీడియోలు ఉంటున్నాయి. ఇది థర్డ్ పార్టీకి సంబంధించిన యాప్ అయినప్పటికీ.. దీని ద్వారా మెటాకు ఆదాయం వస్తుంది కాబట్టి.. మెటానే దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది.

## జనసేనకు వేలాది దరఖాస్తులు ఆగస్టులో కమిటీలు

**- మంత్రి కందుల దుర్గేష్**



విజయవాడ(ప్రశ్న న్యూస్)జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' కార్యక్రమం కింద ఆరు రోజుల పాటు సాగిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆదివారం విజయవంతంగా ముగిసిందన్నారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీరమహిళల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గ కమిటీతో పాటు లీగల్, విద్యార్థి, మీడియా, ఐటీ అండ్ డేటా మేనేజ్‌మెంట్, పర్యావరణం, సేవాదళ్, వీరమహిళ, పాడ్‌కాస్ట్, చేనేత, డాక్టర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, యువజన, సాంస్కృతిక, మత్స్యకార తదితర అనుబంధ విభాగాల కమిటీల్లో పనిచేసేందుకు వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌తో పాటు విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకులు, సాధక్ ప్రతినిధులు, పార్లమెంట్ అబ్జర్వర్ల బృందం ప్రతి దరఖాస్తును పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ముందుకు రావడం పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా లోక్‌సభ, అసెంబ్లీ, జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలతో పాటు అనుబంధ విభాగాల్లో బాధ్యతలను స్వయంగా ఎంపిక చేసుకునేలా దరఖాస్తు విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఎంపిక ప్రక్రియ ఆగస్టు నాటికి పూర్తవుతుందని, అనంతరం నూతన కమిటీలతో కలిసి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో జనసేనను మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యులను మంత్రి కందుల దుర్గేష్ సత్కరించగా, సభ్యులు కూడా ఆయనను ఘనంగా సన్మానించారు.

# చేజర్లలో మూడు చారిత్రక దేవాలయాల పునర్నిర్మాణానికి

# భూమి పూజ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**- పురాతన ఆలయాలకు పూర్వ వైభవం.. -రూ.808 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా పునరుద్ధరణ**

**- చేజర్లలో మూడు చారిత్రక దేవాలయాల పునర్నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి భూమిపూజ**

**మూడేళ్లలో 5 వేల శ్రీవాణి ఆలయాల నిర్మాణమే లక్ష్యం - దేవాదాయ శాఖ మంత్రి**



చేజర్ల(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 684 పురాతన ఆలయాల పునరుద్ధరణకు రూ.808 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలం పెరుమాళ్లపాడు, చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో రూ.5.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మూడు చారిత్రక దేవాలయాల పునర్నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభ స్వాగతం, భక్తుల గోవింద నామస్మరణల మధ్య జరిగిన కార్యక్రమంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాల అభివృద్ధికి సంకల్పం చేశారు.

### నాగేశ్వరాలయానికి పూర్వ వైభవం

పెన్నా నది ఇసుక మేటల కింద వెలుగులోకి వచ్చిన పెరుమాళ్లపాడు చారిత్రక శ్రీ నాగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లతో శ్రీకారం చుట్టారు. సుమారు 200 నుంచి 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన శైవక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. అలాగే చేజర్ల, చిత్తలూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ.4 కోట్లతో పనులు ప్రారంభించారు.

### ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి ప్రాధాన్యం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి శాశ్వత చిహ్నాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో 5 వేల శ్రీవాణి ఆలయాలను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ధూపదీప నైవేద్య పథకం కింద 6,229 ఆలయాలకు రూ.75 కోట్ల నిధులు అందిస్తున్నామని, 988 ఆలయాలకు ట్రస్ట్ బోర్డులు నియమించగా మరో 412 ఆలయాలకు త్వరలో ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5 వేల భజన మందిరాల నిర్మాణానికి సుమారు రూ.1,500 కోట్లు వెచ్చించనున్నట్లు, ఇప్పటికే 1,269 భజన మందిరాలకు రూ.216.45 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

### పెరుగుతున్న భక్తుల రద్దీ

రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. ధూపదీప నైవేద్యం, శ్రీవాణి తదితర కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు మూడు కోట్ల మంది భక్తులు ప్రసాదం స్వీకరించగా, ప్రతి నెల 24 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నామని పేర్కొన్నారు. మరో 111 ఆలయాల్లో అన్నప్రసాద పథకాన్ని విస్తరించనున్నట్లు వెల్లడించారు.
2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి తీరం వెంబడి ఉన్న 52 ఆలయాల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.
గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రతి పురాతన ఆలయాన్ని గుర్తించి పునరుద్ధరిస్తామని, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధితో పాటు భారతీయ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు అందించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, వేదపండితులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి చేనుకి నీరు...

## రైతు ముఖంలో చిరునవ్వే లక్ష్యం

**మండల అధ్యక్షుడు బావన దుర్యోధన**

**రూ.8 కోట్లతో సాగునీటి అభివృద్ధికి చర్యలు**



మందస(ప్రశ్న న్యూస్) పలాస నియోజకవర్గంలోని మందస మండలం దామోదర సాగరం ప్రాజెక్టు ఆధునికీకరణ, కాలువల పూడికతీత పనులను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో మండలంలోని రైతులకు ఎంతో మేలు చేకూరేలా సాగునీటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. దామోదర సాగరం ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని, మండల వ్యాప్తంగా ఉన్న 32 కాలువల పూడికతీత పనులకు రూ.1 కోటి కేటాయించిందని వివరించారు. మొత్తంగా వ్యవసాయ, నీటిపారుదల రంగ అభివృద్ధి కోసం మందస మండలానికి సుమారు రూ.8 కోట్ల నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే గౌతు శిరీష కీలక పాత్ర పోషించారని కొనియాడారు. "ప్రతి చేనుకి నీరు -- ప్రతి చేతికి పని" అనే లక్ష్యంతో సాగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో దళారీల ప్రమేయం లేకుండా రైతులే ప్రత్యక్షంగా పనులను పర్యవేక్షించడం వల్ల నిధులు సద్వినియోగం అవుతున్నాయని, పనుల్లో నాణ్యత కూడా మెరుగ్గా ఉంటోందని బావన దుర్యోధన తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం మందస మండలంలో సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గి, వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ ముంజేటి, కర్రయ్య బమ్మిడి, రట్టి లింగరాజు, గేదెల దుర్యోధన, రవీంద్ర గౌడ, చంద్రమౌళి, గెడ్డవలస భీమారావుతో పాటు అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## భక్తి పారవశ్యంలో ఎమ్మెల్యే గౌతు శిరీష

### శ్రీ కాటమ్మ తల్లి జంగిడిని నెత్తిన మోసి ప్రత్యేక పూజలు

**- ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**



పలాస(ప్రశ్న న్యూస్)పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శ్రీ కాటమ్మ తల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ కాటమ్మ తల్లి అమ్మవారి సంబరాల్లో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారి జంగిడిని భక్తిపూర్వకంగా నెత్తిన మోసుకుంటూ ఆలయ ప్రాంగణంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పలాస నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ప్రాంత అభివృద్ధి, రైతాంగం సంక్షేమం కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తి, సంప్రదాయం, సంస్కృతిని చాటిచెప్పే ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శ్రీ కాటమ్మ తల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీ కాటమ్మ తల్లి ఆటో యూనియన్ సభ్యులకు, ఆటో కార్మికులకు, నిర్వాహకులకు, భక్తులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రీ కాటమ్మ తల్లి అమ్మవారి కృపాకటాక్షాలు పలాస నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో గజ్వేల్ సూర్య నమస్కారాల బృందం ఆధ్యాత్మిక యాత్ర

**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సూర్య నమస్కారాల బృందం సభ్యులు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. నిత్యం యోగా, సూర్య నమస్కారాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్న ఈ బృందం, లోకక్షేమం, ప్రజల ఆయురారోగ్యాల కోసం ఆధ్యాత్మిక యాత్రను నిర్వహించింది. యాదగిరి కొండపై స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను బృంద సభ్యులకు అందజేశారు. ప్రతి వ్యక్తి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, సమాజంలో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు కావాలని కోరుతూ స్వామివారిని వేడుకున్నామని బృంద సభ్యులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో గజ్వేల్ సూర్య నమస్కారాల బృందం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రక్తదానం చేయాలనుకుంటున్నారా?



రక్తదానం ఓ గొప్ప దాతృత్వ కార్యం. ఒక రక్తపు చుక్క విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే అవసరమైన సమయాల్లో రక్తదానం చేసేందుకు లక్షలాది మంది ముందుకొస్తుంటారు. అయితే మీరు కూడా రక్తదానం చేస్తారా? రక్తదానం చేసే ముందు కొన్ని ఆహారాలు తప్పక తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రక్తదానం ఓ గొప్ప దాతృత్వ కార్యం. ఒక రక్తపు చుక్క విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే అవసరమైన సమయాల్లో రక్తదానం చేసేందుకు లక్షలాది మంది ముందుకొస్తుంటారు. అయితే మీరు కూడా రక్తదానం చేస్తారా? రక్తదానం చేసే ముందు కొన్ని ఆహారాలు తప్పక తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్‌లో నైట్రేట్లు, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచి రక్తాన్ని ఆరోగ్యంగా చేస్తాయి. అందువల్ల రక్తదానం చేసే ముందు బీట్‌రూట్ తీసుకోవడం మంచిది. అలాగే సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో ఇనుము శోషణను పెంచుతుంది. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. రక్త ప్రసరణను నిర్వహించడానికి సహాయపడుతుంది. గుడ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్, విటమిన్ బి12 వీటిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. రక్తదానం చేసిన తర్వాత వచ్చే అలసట, నీరసాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. పాలకూరలో ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. అందుకే రక్తదానం చేయడానికి ఒకటి లేదా రెండు రోజుల ముందు పాలకూర తీసుకోవడం మంచిది. బాదంలో ప్రోటీన్, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవి రక్తదానం చేసిన తర్వాత అలసటను నివారిస్తాయి. నీరు ఎక్కువగా తాగాలి. మన శరీరంలో సగం రక్తం నీటితో తయారవుతుంది. రక్తదాన ప్రక్రియలో మీరు కొంత ద్రవాన్ని కోల్పోయినప్పుడు, రక్తపోటు తగ్గవచ్చు. దీనివల్ల తల తిరుగుతున్నట్లు అనిపించవచ్చు.

## శ్రీవారి సన్నిధిలో కొనసాగుతున్న రద్దీ..

## శిలాతోరణం వరకు క్యూలైన్‌లో భక్తులు



శ్రీ శ్రీనివాస గోవిందా.. శ్రీ వేంకటేశ గోవింద నామస్మరణతో తిరుమల గిరులు భక్తులతో రద్దీగా మారాయి. వారాంతపు సెలవు దినం కారణంగా తరలివచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. శనివారం స్వామివారిని 90,546 మంది భక్తులు దర్శించుకోగా 36,303 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.93 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు. 4.61 లక్షల లడ్డూలను విక్రయించగా 2.54 లక్షల మందికి అన్న ప్రసాదం అందించామని తెలిపారు.

## మేడిగడ్డకు భారీగా పోటెత్తుతున్న వరద



జయశంకర్ భూపాలపల్లి : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం పోటెత్తుతుంది. బరాజ్ ఇన్ ఫ్లో 90,580 క్యూసెక్కుస్ ల వరద ప్రవాహం రాగా బరాజ్ లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తం లో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు

## గుండెను కాపాడుతున్న వెల్లుల్లి..?

వెల్లుల్లి లేనిది వంటిల్లే ఉండదు. చాలా వరకు ప్రతి ఒక్కరి ఇంట్లో వెల్లుల్లి ఉంటుంది. ఇంది వంట్లో వేయడం వలన ఆహారపదార్థాలకు మంచి రుచిని ఇవ్వడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మరీ ముఖ్యంగా వెల్లుల్లి ఎక్కువగా తినడం వలన ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందంట.వెల్లుల్లి లేనిది వంటిల్లే ఉండదు. చాలా వరకు ప్రతి ఒక్కరి ఇంట్లో వెల్లుల్లి ఉంటుంది. ఇంది వంట్లో వేయడం వలన ఆహారపదార్థాలకు మంచి రుచిని ఇవ్వడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మరీ ముఖ్యంగా వెల్లుల్లి ఎక్కువగా తినడం వలన ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందంట. వెల్లుల్లి రక్తపోటును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక రక్తపోటు గుండెపోటు, స్ట్రోక్‌లకు ప్రధాన ప్రమాద కారకం. దీని వల్లనే చాలా మంది గుండె పోటుకు గురి అవుతున్నారు. అయితే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం లేదా సప్లిమెంట్ రూపంలో తీసుకోవడం వలన ఇది రక్తనాళాల నుంచి రక్తప్రవాహాన్ని మెరుగు పరిచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందంట. వెల్లుల్లిలోని సారం, సిస్టోలిక్, డయాస్టొలిక్ రక్తపోటును తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం వలన ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడమే కాకుండా, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. అంతే కాకుండా ఇది ధమనులను శుభ్రపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువలన ప్రతి ఒక్కరూ, ప్రతి రోజూ తమ ఆహారంలో వెల్లుల్లిని చేర్చుకోవడం వలన ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుందని చెబుతున్నారు నిపుణులు. వెల్లుల్లి కేవలం రుచిని పెంచేది మాత్రమే కాదు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే ఔషధ గుణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. వెల్లుల్లిలోని అల్లిసిన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతే కాకుండా కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడానికి రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. అందుకే వెల్లుల్లిని తప్పని సరిగా తీసుకోవాలి. వెల్లులి ఆహారంలో చేర్చుకోవడం వలన ఇది హృదయ సంబంధ వ్యాధులను దూరం చేయడమే కాకుండా, ఇందులో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాల కూడా పుష్కలంగా ఉంటాయి.

## ప్రజా సమస్యల పరిష్కారానికే 'వార్డు బాట'
# ప్రతి ఆదివారం వార్డుల పర్యటన

**సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ రజిత పరుశురాం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) జగదేవపూర్ గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వెంటనే పరిష్కారం చూపాలనే సంకల్పంతో తిగుల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 'వార్డు బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం తెలిపారు. ఆదివారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో సర్పంచ్ రజిత పరుశురాం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి వార్డు బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఆదివారం ఒక వార్డును సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అత్యవసర సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంతర్గత రహదారులు బురదమయంగా మారిన ప్రాంతాల్లో వెంటనే మట్టి పోసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమని, మహిళలు, యువత, గ్రామస్థులు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నీరజ కరుణాకర్, అశోక్, ఆంజనేయులు, లక్ష్మి నర్సింలు, నాయకులు మహేందర్ రెడ్డి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

## కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసులతో సమన్వయ చర్యలు కు ఆదేశాలు జారీ చేసిన: సీఎం చంద్రబాబు

**సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు**



కుప్పం(ప్రశ్న న్యూస్) విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా గుర్తించేందుకు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే కుప్పంలో ఉన్న సీఎం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్టుగార్డు, భారత నౌకాదళం (నేవీ), మెరైన్ పోలీసు విభాగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. అధికారుల వివరాల ప్రకారం ఎం ఎం–83 నంబర్ గల ఫిషింగ్ బోటు జూన్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏడుగురు మత్స్యకారులతో విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు బయలుదేరింది. జూలై 4వ తేదీ మధ్యాహ్నానికి తిరిగి హార్బర్‌కు చేరుకోవాల్సి ఉండగా, సాంకేతిక సమస్యల కారణంగా ఇప్పటివరకు బోటు తిరిగి రాలేదని తెలిపారు. గంగవరం సముద్రతీరం సమీపంలో బోటుకు సాంకేతిక లోపం తలెత్తినట్లు ప్రాథమిక సమాచారం అందిందని అధికారులు వెల్లడించారు. ఆదివారం ఉదయం నుంచి భారత నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లతో పాటు కోస్టుగార్డు నౌకలు కూడా గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మెరైన్ ఐజీ, విశాఖ నగర పోలీసు కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ, అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో గాలింపు చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు, విశాఖ జిల్లా ప్రజాప్రతినిధులను సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు బృందాలు సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా గుర్తించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

## సోషల్ వెల్ఫేర్ పాఠశాలనుఆకస్మిక తనిఖీ చేసిన

**– ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**విద్యార్థులతో కలిసి భోజనం కష్టపడి చదివి**



**ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచన**

మడికొండ(ప్రశ్న న్యూస్) వర్ధన్నపేట నియోజకవర్గంలోని మడికొండ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వసతి గృహాలు, భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎమ్మెల్యే, వారికి అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, వైద్య సేవలు, మెడికల్ కిట్లు, మందులు, ఇతర కనీస వసతుల గురించి విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో పాటిస్తున్న పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదని, ప్రస్తుతం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు పొందేందుకు తీవ్ర పోటీ నెలకొనడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్, క్రీడలు, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో

# ప్రజాస్వామ్య పాఠం నేర్పిన ఆశ్రమ పాఠశాల

## బ్యాలెట్ పద్ధతిలో స్టూడెంట్ లీడర్ల ఎన్నిక.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు




ములుగు (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్య విలువలపై చిన్నారులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించేలా ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ఆశ్రమ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. భారత ఎన్నికల వ్యవస్థ ఎలా పనిచేస్తుందో విద్యార్థినులకు ప్రత్యక్ష అనుభవంతో అర్థమయ్యేలా పాఠశాల యాజమాన్యం స్టూడెంట్ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించింది. 2026–2027 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల స్టూడెంట్ లీడర్లను విద్యార్థినులు స్వయంగా ఎన్నుకున్నారు.

**9వ తరగతి నుంచి పోటీ, 10వ తరగతి విద్యార్థినులే ఎన్నికల విధులు**

ఈ ఎన్నికల్లో 9వ తరగతి విద్యార్థినులు వివిధ పోస్టులకు పోటీ



పడ్డారు. స్టడీ లీడర్, గేమ్స్ లీడర్, ఫుడ్ లీడర్, హెల్త్ లీడర్, కల్చరల్ లీడర్, ఎస్పిఎల్ లీడర్ తదితర బాధ్యతల కోసం ఆసక్తికరంగా పోటీ జరిగింది. పూర్తిగా నిజమైన ఎన్నికల మాదిరిగానే నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు అన్ని దశలు నిర్వహించారు. ఎన్నికల విధులన్నింటినీ 10వ తరగతి విద్యార్థినులు స్వచ్ఛందంగా నిర్వర్తించడం విశేషం. ప్రతి విద్యార్థిని తమ ఓటు హక్కును వినియోగించుకుని తమకు నచ్చిన అభ్యర్థిని ఎంపిక చేసుకున్నారు. సన్మానం, ప్రమాణ స్వీకారం ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన విద్యార్థినులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారిచే ప్రమాణ స్వీకారం చేయించి, తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఓటు విలువ పట్ల అవగాహన పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులందరూ పాల్గొని విజయవంతం చేశారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం

- **పూర్తిస్థాయిలో అధికారుల అండదండలు..?**
- **అనుమతుల పై అనుమానాలు..? అధికారుల మౌనం**
- **రాజకీయ పలుకుబడితో జీహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి**
- **టౌన్ ప్లానింగ్ మౌనంపై ప్రజల మండిపాటు**






కీసర(ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి అక్రమమార్గంలో అక్రమంగా నిర్మిస్తున్న చర్యలు తీసుకోవలసిన కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బండ్లగూడ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం జోరుగా సాగుతుంది, కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. బండ్లగూడ సమీపంలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా.? లేదా.? ఉంటే ఎందుకు నిర్మాణదారుడు నిర్మాణం ముందు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేవన్న దానిపై స్పష్టత లేకపోయినా పనులు నిరాటంకంగా కొనసాగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులకు వివరణ కోరుతూ ఎలాంటి సమాధానం చెప్పకుండా చూస్తాం వస్తాం అంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడుతున్నారు. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా వెంటనే నోటీసులు జారీ చేసే కూల్చివేతలు చేసే అధికారులు, ఇంత భారీ నిర్మాణాన్ని చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. రాజకీయ పలుకుబడితో మున్సిపల్ నిబంధనలను పక్కనబెట్టి నిర్మాణం కొనసాగిస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నజరానాలు అందడం తోనే అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్కిల్ ఉన్నతాధికారులు తరచూ ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పటికీ నిర్మాణాన్ని గుర్తించలేదా.? లేక ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదా.? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అనేక ఆరోపణలు వచ్చినా, కఠిన చర్యలు లేకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై సందేహాలు పెంచుతోంది. పాత కలెక్టర్ కార్యాలయం వద్ద అయాన్ డిజిటల్ ముందు భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్న అధికారులు చర్యలు తీసుకోకుండా సెటిల్మెంట్ చేసుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు అంశాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ నిర్మాణం అక్రమమని తేలితే వెంటనే పనులను నిలిపివేసి, కూల్చివేతలు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చెడు నడతకు స్వస్తి పలకాలి

- **అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి**
- **ఇబ్రహీంపట్నంలో సీఐ సుబ్రహ్మణ్యం కౌన్సెలింగ్**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చెడు నడత కలిగిన వ్యక్తులు, సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్ ఉన్నవారికి ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రవర్తనలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. తమ పరిసర ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు లేదా నేరాలు గమనించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రవర్తనలో మార్పు చూపించి చట్టబద్ధంగా జీవిస్తే సంబంధిత వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, మంచి ప్రవర్తన కనబరిచే వారికి తగిన విధంగా సానుకూల నివేదికలు పంపుతామని సీఐ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేర కార్యకలాపాలకు పాల్పడవద్దని, నేరాలకు పాల్పడే వారిపై పోలీసులకు సమాచారం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం క్రైమ్ ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్, ఎస్ఐ రవివర్మ, ఎస్ఐ సత్యవతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖ మత్స్యకారులు క్షేమం

**మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**త్వరిత చర్యలతో సురక్షితంగా తీరానికి, ఒడిశా ప్రభుత్వానికి మంత్రి డోలా స్వామి కృతజ్ఞతలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖ జిల్లాకు చెందిన మత్స్యకారులను సురక్షితంగా తీరం చేర్చినట్లు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ లభించడంతో వారి కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారని పేర్కొన్నారు. మత్స్యకారులు గల్లంతయ్యారన్న సమాచారం అందిన వెంటనే మంత్రి విశాఖ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని, బాధితులకు అవసరమైన సహాయక చర్యలు తక్షణమే అందించాలని ఆదేశించారు. అధికారుల సమన్వయంతో చేపట్టిన చర్యల ఫలితంగా సాయంత్రానికి మత్స్యకారుల ఆచూకీ లభించి వారిని క్షేమంగా తీరానికి చేర్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు తక్షణమే స్పందించిన ఒడిశా ప్రభుత్వానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహాయక చర్యల్లో సమన్వయంతో పనిచేసిన ఆంధ్రప్రదేశ్ అధికారులను అభినందించారు. మత్స్యకారులను వారి స్వస్థలాలకు సురక్షితంగా చేర్చేందుకు



## ఘనంగా ప్రారంభమైన

# నార్నే నితిన్ కొత్త సినిమా

యంగ్ టైగర్ ఎన్టీఆర్ బావమరిది, యువ హీరో నార్నే నితిన్ తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాకు ఎచీచీ5 అనే వర్కింగ్ టైటిల్‌తో హైదరాబాద్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ చిత్రంలో నితిన్ సరసన ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. 'బుట్టబొమ్మ' ఫేమ్ అనిఖా సురేంద్రన్, కన్నడ నటి మేఘా శెట్టి కథానాయికలుగా ఎంపికయ్యారు. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె. నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కళ్యాణ్ శంకర్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ చిత్రానికి వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తుండగా, 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించనుండటం విశేషం. పూజా కార్యక్రమాల అనంతరం చిత్ర యూనిట్ త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని ప్రకటించింది. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## అవకాశాల కోసం రాజీ పడొద్దు

# యువ నటులకు కాజల్ హితవు



సినీ పరిశ్రమలో అవకాశాల కోసం ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టవద్దని, వ్యక్తిగత హద్దులను దాటవద్దని యువ నటీనటులకు సీనియర్ నటి కాజల్ అగర్వాల్ హితవు పలికారు. తన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన రెండు దశాబ్దాల సినీ ప్రస్థానంలోని అనుభవాలను పంచుకున్నారు. "అవకాశాల కోసం ప్రతిదానికీ 'యస్' చెప్పాల్సిన అవసరం లేదు. మనకు నచ్చని లేదా అసౌకర్యంగా అనిపించే విషయాలకు ధైర్యంగా 'నో' చెప్పడం నేర్చుకోవాలి" అని కాజల్ స్పష్టం చేశారు. తన కెరీర్‌లోనూ ఇబ్బందికరంగా అనిపించిన బికినీ సన్నివేశాలను, శృతిమించిన శృంగార దృశ్యాలను తిరస్కరించానని.. వ్యక్తిగత గౌరవాన్ని కాపాడుకోవడం అత్యంత ప్రధానమని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సోషల్ మీడియా కారణంగా యువ నటీనటులు విపరీతమైన ఒత్తిడిని, అవాస్తవిక సౌందర్య ప్రమాణాలను ఎదుర్కొంటున్నారని కాజల్ ఆవేదన వ్యక్తం చేశారు. "వారిని చూస్తుంటే బాధగా ఉంది. ఈ ఒత్తిళ్లను తట్టుకుని వారు పరిశ్రమలో నిలదొక్కుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. తన కెరీర్ ఆరంభంలో బరువు పెరగడం, తగ్గడం వంటి అంశాలపై కొన్ని సూచనలు ఎదురైనప్పటికీ, ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే నాటి ఒత్తిడి చాలా తక్కువేనని ఆమె గుర్తుచేసుకున్నారు. 'ది ఇండియా స్టోరీ' చిత్రం కోసం చేసిన పరిశోధన ద్వారా దేశంలోని ఆహార భద్రత సమస్యలపై తనకు అవగాహన పెరిగిందని, ఆ ప్రభావంతో తన కుటుంబ జీవనశైలిలోనూ కొన్ని మార్పులు చేసుకున్నానని కాజల్ వివరించారు.



# అది నిజం కాదు

తన సినిమాపై సాంఘిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై కథానాయిక కీర్తి సురేశ్ కౌంటరిచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా రూపొందుతున్న భారీ చిత్రంలో కీర్తి సురేశ్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె వెంకటేష్ జోడీగా నటిస్తున్నది. ఈ సినిమా.. మలయాళంలో 2024లో వచ్చిన 'గురువాయూర్ అంబలనాదయిల్' చిత్రం రీమేక్‌గా తెరకెక్కుతున్నదని ఇన్‌స్టాలో ఎవరో పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. దానికి కీర్తి సురేశ్ స్పందిస్తూ.. 'అందులో ఏ మాత్రం నిజం లేదు.ఇది కొత్త కథ. అందరూ మెచ్చే కథ' అంటూ కామెంట్ పెట్టింది. దీంతో వెంకీ, కల్యాణ్‌రామ్ చిత్రంపై వస్తున్న గాలి వార్తలకు చెక్ పెట్టినట్టయింది. రాయలసీమ నేపథ్యంలో, అనిల్ మార్క్ కామెడీతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈచిత్రానికి 'జనవరి 13న విడుదల' అనే టైటిల్‌ని కూడా అనుకుంటున్నారు.

## 'శ్రీనివాస మంగాపురం'పై

# భారీ అంచనాలు



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో సినీ ప్రేక్షకులకు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. ఘట్టమనేని జయకృష్ణ హీరోగా రూపొందుతున్న శ్రీనివాస మంగాపురంపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడైన జయకృష్ణ హీరోగా నటిస్తున్నఈ చిత్రాన్ని విభిన్న కథలను ఎంచుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న ఓ వార్త మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. జూలై 30, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.రిలీజ్‌కు ఇంకా కొన్ని వారాలు ఉండగానే సినిమా ఫస్ట్ కాపీ సిద్ధమైనట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని, చిత్రబృందం విడుదలకు సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, వచ్చే వారంలో ఘట్టమనేని కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా ఒక ప్రైవేట్ స్క్రీనింగ్ ఏర్పాటు చేయనున్నారట. ఈ స్పెషల్ షోలో కుటుంబ సభ్యులు మాత్రమే కాకుండా చిత్ర యూనిట్‌కు అత్యంత సన్నిహితులు కూడా పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ప్రదర్శనకు సూపర్ స్టార్ మహేష్ బాబు కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది.అయితే ప్రస్తుతం మహేష్ బాబు తన పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉండటంతో, ఆ రోజున ఆయన ఈ ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యే అవకాశం తక్కువగా ఉందని సమాచారం. అందుకే మహేష్ బాబు కోసం మరో ప్రత్యేక షోను వేరుగా ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆ ప్రత్యేక ప్రదర్శనకు హీరో జయకృష్ణతో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం, దర్శకుడు అజయ్ భూపతి కూడా హాజరుకానున్నారని సమాచారం. 'శ్రీనివాస మంగాపురం' సినిమా సాధారణ కమర్షియల్ కథ కాదు. తిరుపతి ప్రాంతం, ముఖ్యంగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ సాగే కథాంశంతో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. విష్ణుమూర్తి స్వయంభువుగా అవతరించిన పవిత్ర క్షేత్రంలో జరిగిన ఒక విశేష సంఘటన ఆధారంగా ఈ కథ సాగుతుందని, భక్తి, మిస్టరీ, భావోద్వేగాలు, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని రూపొందించినట్లు సమాచారం



## కొత్త ఆరంభానికి

# స్వాగతం

ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక సమంత. ఈ సినిమా విజయోత్సాహంలో ఉన్న ఈ భామ టాక్‌షో హోస్ట్‌గా అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీలివ్‌లో ఈ టాక్‌షో స్ట్రీమింగ్ కానుంది. త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇప్పటిదాక వచ్చిన టాక్‌షోలకు భిన్నంగా దీనిని డిజైన్ చేశారని తెలిసింది. కేవలం మహిళా సెలబ్రిటీలే ఈ షోకు గెస్ట్‌లుగా వస్తారట. సినీరంగంలోని వివిధ విభాగాల్లోని ఫీమేల్ టెక్నీషియన్స్ జీవితాలను, వృత్తిపరంగా వారు ఎదుర్కొనే కష్టాలను ఈ షో ద్వారా ఆవిష్కరించబోతున్నట్లు సమాచారం. ఈ సరికొత్త ప్రాజెక్ట్ గురించి సమంత సోషల్‌మీడియాలో స్పందించింది. 'మార్పును స్వీకరించడం, ప్రయాణాన్ని నమ్మడం, కొత్త ఆరంభాలకు స్వాగతం పలకడం వంటి విషయాలను ఈ ఏడాది నాకు గుర్తుచేసింది. సోనీ లివ్‌తో కలిసి ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని సమంత పేర్కొన్నది.

# చిరకాలం

## గుర్తుండిపోతుంది



"గుర్తుకొస్తున్నాయి' సిరీస్ కోసం ఏడాదిన్నర పాటు టీమ్ అంతా కష్టపడ్డామని, ఇప్పుడిది ప్రతీ ఒక్కరి హృదయానికి దగ్గర కావడం ఆనందంగా ఉందన్నారు నిర్మాత శరత్‌చంద్ర నాయుడు. విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా నటించిన ఈ సిరీస్‌కు వినోద్ గాలి దర్శకత్వం వహించారు. ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. చాలా ఏళ్ల తర్వాత మంచి సిరీస్ చూశామని అందరూ ప్రశంసిస్తున్నారని, అల్లు అర్జున్ సిరీస్ చూసి ట్వీట్ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. తాను పాత్రల పరంగా కొత్తగా ప్రయత్నిస్తున్న ప్రతీసారి ప్రేక్షకులు ఆదరిస్తున్నారని, ఈ సిరీస్ చూసి భావోద్వేగానికి గురయ్యామని చాలా మంది ఫోన్లు చేసి చెబుతున్నారని హీరో విరాజ్ అశ్విన్ అన్నారు.

ప్రతీ ఒక్కరి జీవితంలోని మధుర జ్ఞాపకాల్ని తట్టిలేపే సిరీస్ ఇదని దర్శకుడు వినోద్ గాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ వైస్‌ప్రెసిడెంట్ సాయికృష్ణతో పాటు సిరీస్‌కు పనిచేసిన టీమ్ అంతా పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా సవరణలో బలహీన వర్గాల ఓట్లు తొలగిపోకుండా చూడాలి

**- పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిరక్షరాస్యులు, వృద్ధులు, నిరుపేదలు, రోజువారీ కూలీలు, వలస కార్మికులు, రైతులు, అర్హులైన యువత ఓటు హక్కు కోల్పోకుండా బీసీ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జి పొలాస నరేందర్ కోరారు. ఈ ప్రక్రియలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో పాటు బీసీ సంఘాలు కూడా భాగస్వాములై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ద్వారా డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలు పారదర్శకంగా నిర్వహించడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. జూన్ 25న ప్రారంభమైన ఈ ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగుతుందని, అనంతరం ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా జాబితా, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా ప్రచురణ జరుగుతాయని తెలిపారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోయారు .

# నిజాంపేట అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి.

## పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి.
## రైతులకు అండగా ఉంటాం.

మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి. మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా నిజాంపేట మండల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పలు అభివృద్ధి పనులు మంజూరు చేశామని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రామాలు, పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. నిజాంపేట మండలానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని, అయితే ప్రస్తుత ఎమ్మెల్యే దానిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులకే ప్రస్తుతం శంకుస్థాపనలు చేస్తున్నారని, రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. రామాయంపేట డివిజన్ ఏర్పాటుకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే కృషి చేసిందని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ గేరిగంటి అనూష భర్త లక్ష్మీనర్సింలు, పార్టీ కార్యకర్తలు పంపరి బెస్త శంకరయ్యను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు. నాగరాజు, మాజీ ఎంపీపీ బిజ్జ సంపత్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, సొసైటీ చైర్మన్ బాపు రెడ్డి, మాజీ సర్పంచ్ గేమ్



సింగ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బజార్ రంజిత్ గౌడ్, నాయకులు వెంకటస్వామి గౌడ్, నాయిని లక్ష్మణ్, పున్న వెంకటస్వామి, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్ బండారి తిరుమల్, నరేందర్ నాయక్, పంపరి శివకుమార్, సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పరిహారం కూడా అందింది...

**దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా చేస్తూ...**

**అటు వైపు కన్నెత్తి చూడని ఇరిగేషన్,విద్యుత్, రెవెన్యూ అధికారులు**

**నిద్ర మత్తులో అధికారులు**

**వెల్లువెత్తుతున్న విమర్శలు...**





మంథని ( ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టు కింద మంథని మండలం అరెంద, గ్రామ శివారులోనీ రైతులు భూములు కోల్పోయారు. అయితే రైతులకు అప్పుడున్న ప్రభుత్వం నష్ట పరిహారం కూడా చెల్లించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి అన్నారం ప్రాజెక్టు సుందిల్ల ప్రాజెక్టు వరకు గోదావరి పరిహారక సరిహద్దున ఉన్న భూములను అప్పటి ప్రభుత్వం భూ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇచ్చింది. కోల్పోయిన భూములే కాకుండా ప్రాజెక్టు కింద తీసుకొని భూములను రైతులు సాగు చేస్తూనే... పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తూ పంట వేసుకుంటూన్నారు. ప్రభుత్వ భూములకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేస్తూన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు అయితే అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రభుత్వ భూముల్లో బోర్లు వేసుకుంటున్నారు. దర్జాగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు మరి కరెంటు డిపార్ట్మెంట్ వాళ్ళు రెవెన్యూ డిపార్ట్మెంట్ వాళ్లు చూస్తూ ఎందుకు ఉ రుకుంటున్నారో అర్థం కావడం లేదు అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం నిద్ర మత్తులో ఉంటున్నారు. అయితే అమ్యమ్యలకు ఆశపడి అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు ప్రజాసంఘాల నాయకులు రైతు సంఘం నాయకులు అంటున్నారు.

# విలాసాగర్‌లో వైభవంగా ముగిసిన పోచమ్మ తల్లి ప్రతిష్ఠా మహోత్సవాలు

**- గ్రామస్తుల సహకారంతో విజయవంతమైన పోచమ్మతల్లి ఉత్సవాలు - కృతజ్ఞతలు**

**- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి ఆదివారం విజయవంతంగా ముగిశాయి. మహోత్సవాల్లో యాగశాల పూజలు, ప్రత్యేక హోమాలు, నల్లపోచమ్మ కథ, మూడు రోజుల అన్నదాన కార్యక్రమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల విజయానికి సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు, యువకులు, మహిళలు, భక్తులందరికీ విలాసాగర్ సర్పంచ్ ఏనుగుల కనకయ్య కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామ ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# రాంపూర్ మాజీ ఎంపిటిసి యాదగిరి మమత కుమార్తె వివాహంలో పాల్గొన్న నాయకులు





మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలం పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి యాదగిరి మమత కుమార్తె వివాహ వేడుకలు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన కొల్చారం మండలం నాయకులు సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహ వేడుకకు కిష్టాపురం గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్ రంగంపేట సీఈవో నవీన్ కుమార్ యాదవ్ నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ కార్యక్రమాలు పాల్గొన్న జర్నలిస్టు నాగరాజు గౌడ్, వడ్ల సంతోష్, నాగులగారి దుర్గ గౌడ్, ఏంబరి శేఖర్ యాదవ్, నాగుల గారి రాజేష్ గౌడ్, వడ్ల చంద్రశేఖర్, ఏంబరి శ్రీను అరికెల ప్రవీణ్, మాచవరం చిన్న, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ, నెహ్రూ మధ్య వ్యత్యాసం. మాజీ ప్రధానిని కించపరిచడం సరికాదు

**మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫీజ్ ఉద్దీన్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సేవలను కించపరిచేలా చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫీజ్ ఉద్దీన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చడం సరికాదని, ఇద్దరి పాలనా విధానం, పరిస్థితులు, చారిత్రక నేపథ్యం పూర్తిగా భిన్నమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశం ఆహార కొరత, నిరుద్యోగం, పారిశ్రామిక వెనుకబాటు, మౌలిక వసతుల లేమి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని నడిపించారని పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఆయన బలమైన పునాదులు వేశారని తెలిపారు. నెహ్రూ దూరదృష్టితో అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఉన్నత విద్యాసంస్థలు నేటి భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచాయని హాఫీజ్ ఉద్దీన్ అన్నారు. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో దేశ తొలి ప్రధానిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని, అన్ని రాజకీయ పార్టీలు చరిత్రను, దేశ నాయకుల సేవలను గౌరవించాలని ఆయన సూచించారు.

# టైప్‌రైటింగ్‌లో ఆదర్శ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థినికి రాష్ట్ర తొలి స్థానం

**- టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ లో రాష్ట్ర టాపర్ గా కూరటి మహిత**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆదర్శ టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని కూరటి మహిత టైప్‌రైటింగ్ ఇంగ్లీష్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలో రాష్ట్ర మొదటి ర్యాంక్ సాధించింది. రాష్ట్ర టెక్నికల్ బోర్డు నిర్వహించిన జనవరి పరీక్షల్లో 200 మార్కులకు 191 మార్కులు సాధించి ఈ ఘనతను చాటింది. స్పీడ్ పేపర్‌లో 96, రెండో పేపర్‌లో 95 మార్కులు పొందింది. మహిత విజయంపై ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ మజీద్, డైరెక్టర్ వాజిద్ హర్షం వ్యక్తం చేశారు. తమ శిక్షణ, ప్రోత్సాహంతో ఈ విజయం సాధించడం ఆనందంగా ఉందని మహిత తెలిపింది. టైప్‌రైటింగ్ నైపుణ్యం విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మజీద్, డైరెక్టర్ వాజిద్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు మహితను ఘనంగా అభినందించారు.

# ఘనంగా 21 వ డివిజన్ కార్పొరేటర్ వారాల నర్సింగం జన్మదిన వేడుకలు

**- డాడీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన సేవా కార్యక్రమం**

**- జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్న వారాల నర్సింగం**






కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21 వ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వారాల నర్సింగం జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వారి నివాసంలో వారి మిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి శాలువాలతో ఘనంగా సన్మానించి, నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడడంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డాడీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

# స్నేహం చిరస్థాయం.. మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 1985-86 బ్యాచ్ స్నేహితులు

**- రాజేష్ పిల్లలకు ఆర్థిక చేయూత -- మానవత్వాన్ని చాటుకున్న1985-86 పూర్వ విద్యార్థులు**

**-అకాల మరణంతో మృతి చెందిన రాజేష్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన పిల్లలకు 42000 - ఆర్థిక సహాయం అందజేస్తున్న1985-86 పదో తరగతి బ్యాచ్ మిత్రులు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆపదలోనే ఆత్మీయత విలువ తెలుస్తుందనే మాటను నిజం చేస్తూ, తమ చిన్ననాటి మిత్రుడు రాజేష్ అకాల మరణంతో దుఃఖంలో ఉన్న ఆయన కుటుంబానికి 1985-86 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచారు. స్నేహబంధం కాలంతో మసకబారదని నిరూపిస్తూ, రాజేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన పిల్లలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిత్రుడిని కోల్పోవడం తమందరికీ తీరని లోటని, ఆయన కుటుంబానికి కష్టకాలంలో తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. రాజేష్ పిల్లల భవిష్యత్తుకు అవసరమైన సందర్భాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పండరి, లింగారెడ్డిపల్లె శ్రీనివాస్, ప్రసాద్‌రావు, పంతులు రాజు, జయరాం తదితర మిత్రులు పాల్గొన్నారు. అనంతరం రాజేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 1985-86 బ్యాచ్ సభ్యుల సేవాభావాన్ని స్థానికులు, బంధుమిత్రులు అభినందించారు.

# అభివృద్ధే మా సమాధానం.. విమర్శలకు పనులతోనే జవాబు

**- మంత్రి నారాయణ**

**"ఐదేళ్ల అభివృద్ధిపై ఆత్మపరిశీలన చేసుకుని మాట్లాడండి" అంటూ వైకాపాపై మంత్రి విమర్శలు**



నెల్లూరు(ప్రశ్న న్యూస్) నెల్లూరు నగర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, విమర్శలు చేసే ముందు గత పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న పనులను బేరీజు వేసుకుని మాట్లాడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రతిపక్ష వైఎస్సార్సీపీపై విమర్శలు గుప్పించారు. ఆదివారం నెల్లూరు నగరంలో సుడిగాలి పర్యటన నిర్వహించిన మంత్రి పలు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నగరంలోని ప్రధాన కాలువల ఆధునీకరణ పనులు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన మంత్రి, గత ప్రభుత్వ హయాంలో రూ.1,100 కోట్లతో ప్రారంభించిన యూజీడీ, తాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం నిలిచిపోయిన పనులను వేగవంతం చేసి నగరానికి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజన్‌కు అనుగుణంగా నెల్లూరులో 15 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 42, 43వ వార్డుల్లో వక్ఫ్ బోర్డు కేటాయించిన 5.5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్‌ను అక్టోబర్ విజయదశమి నాటికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. విద్యార్థుల కోసం అత్యాధునిక స్విమ్మింగ్ పూల్‌తో పాటు అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నగరాన్ని వరదల ముప్పు నుంచి రక్షించేందుకు రూ.50 కోట్లతో చేపట్టిన 15 ప్రధాన డ్రైన్ల ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రస్తుతం జరుగుతున్న ఎనిమిది డ్రైన్లతో పాటు మిగిలిన పనులన్నింటినీ డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నెల్లూరులో వందల కోట్ల రూపాయలతో 15 ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరిస్తున్న మంత్రి నారాయణను అభినందించారు. నగరంలో స్మార్ట్ స్ట్రీట్స్, విస్తృత రహదారులు, స్వర్ణాల చెరువు వద్ద నెక్లెస్ రోడ్ వంటి అభివృద్ధి పనులు నెల్లూరుకు కొత్త రూపును తీసుకొస్తాయని అన్నారు. మంత్రి బ్యాటింగ్‌కు విద్యార్థులు ఫిదాపర్యటనలో భాగంగా మూలాపేట బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. అబ్దుల్ అజీజ్ బౌలింగ్ వేయగా, మంత్రి నారాయణ బ్యాట్‌తో భారీ షాట్ కొట్టడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు. అధికారిక సమీక్షల మధ్య విద్యార్థులతో మంత్రి సరదాగా గడిపిన క్షణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీ రావు, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరేటర్ కరిముల్లా, స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సర్వే నెం1,సర్కార్ భూమిలో

# బహుళ అంతస్తులు: ఇటుక గోపి

- జిహెచ్ఎంసి అధికారులు ఇచ్చిన అనుమతులు సర్వే నెంబర్ 4,8,9.సర్వే నెంబర్ :1,9 లో నిర్మాణం జరుగుతుంది, కానీ సర్వే నెంబర్ :9 మాత్రం పట్టా స్థలం ఒకటి మాత్రం సర్కార్ భూమి
- పేదలు ప్రభుత్వం భూమిలో ఇల్లు నిర్మించుకుంటే నేలమట్టం. అదే బహుళ అంతస్తులు నిర్మాణం చేస్తే కూల్చరు. ఇదేమీ న్యాయం
- గవర్నమెంట్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు తొలగించి వాటిపై చర్యలు తీసుకోవాలి
- మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ప్రజా వాణిలో సర్వే నెంబర్ 1, 157/1 పై ఫిర్యాదు





తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి
తెలంగాణ రాష్ట్రం (TMRPS)

తేది: 29/06/2026

To
The District Collector
Medchal-Malkajgiri District
Telangana.

Subject: Request for Intervention, Impleadment in W.P. No. 9120 of 2026, and Protection of Government Land Involved in an Inter-Mandal Boundary Dispute

Respected Sir/Madam,

I respectfully submit the following for your kind consideration:

It is brought to your notice that a serious boundary dispute and survey overlap exists between Survey No. 57 of Hasmathpet Village, Balanagar Mandal, and Survey No. 157/1 of Thokatta Village, Tirumalagiri Mandal.

The existence of this inter-mandal boundary dispute has already been officially acknowledged in the following records:

Letter No. B/91/2026, dated 09-03-2026, issued by the Tahsildar, Balanagar Mandal.

Letter No. LP/925/3040/2026, dated 30-01-2026, issued by the District Collector, Medchal-Malkajgiri District.

Joint Report of the Mandal Surveyor and Mandal Girdawar, Balanagar Mandal, dated 06-03-2026.

These records clearly establish that the land is affected by a boundary dispute, survey overlap, and pending litigation before various authorities, including the CCLA.

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి డివిజన్ బాల్ నగర్ మండలంలో ప్రభుత్వ భూములకు రెక్కలు కడుతున్న రాజకీయ నాయకులు,రెవెన్యూ అధికారులు.?ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో భూ బకాసురులు ప్రభుత్వం స్థలాలపై విరుచుకుపడుతున్నారు.అతి ముఖ్యంగా సర్వే నెంబర్ "1"లో మాయల మరాఠీలు కోకొల్లలుగా రాబందుల్లా సర్కార్ భూముల్లో ఏదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.వీరికి స్థానిక నేతలు,రెవెన్యూ అధికారులుదొంగలకు సపోర్ట్ చేస్తున్నారని టిఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి "ప్రజా ప్రశ్న" తో పంచుకున్నారు. అలాగే జరుగుతున్న అక్రమ నిర్మాణం పై ప్రజా వాణిలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.



### కరస్పాండెంట్ చేసిన వివిధ హోదాల్లో ఉన్న అధికారులు..

1) మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, 2) అల్వాల్ ఆర్డీవో . 3) బాలానగర్ మండల్ ఎమ్మార్వో, అలాగే వెంటనే డబ్యూ నెంబర్: 9120/2026,లో ఇంప్లీడింగ్ కావాలని కోరుతూ లెటర్ ఇవ్వడం జరిగింది. బాలానగర్ మండల్ హస్మత్ పేట్ విలేజ్ సర్వే నెంబర్ 57, తిరుమలగిరి మండల్ తోకట్ట విలేజ్ సర్వే నెంబర్ 157/1, మధ్య ఉన్న బార్డర్ డిస్పుట్, ఓవర్ ల్యాపింగ్ విషయంలో ప్రైవేటు వ్యక్తులు కేవాలం 1) తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ డిపార్ట్మెంట్ ని 2) హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ని,3) సికింద్రాబాద్ ఆర్డీవోని 4) తిరుమలగిరి మండల్ ఎమ్మార్వోని మాత్రమే కోర్టు లో పార్టీ చేసి కోర్టు ఆర్డర్ తుసుకు వచ్చి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు.రెండు మండలాల మధ్య బార్డర్ డిస్పూట్ ఉన్న వివాద ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుంది.తిరుమలగిరి మండల్ ఎమ్మార్వో పై విషయంలో సంబంధిత అధికారులకు, కోర్టులో ఈ బార్డర్ డిస్పుట్, ఓవర్ ల్యాపింగ్ విషయం పై సరైన సమాచారం ఇవ్వక పోవడంతో కోర్టు ఆర్డర్ రావడం జరిగింది. తిరుమలగిరి మండల్ ఎమ్మార్వో బిక్షపతి తన జూనియర్ అసిస్టెంట్ అరుణ్ తో కలిసి ఆఫిస్ లో కుర్చోని లెటర్ రాశారన్నారు. తిరుమలగిరి మండల్ సర్వేయర్ తాను ఫిల్డ్ విజిటింగ్ చేయలేదని, సర్వే చేయలేదు అన్నారు.కాని తిరుమలగిరి మండల్ ఎమ్మార్వో,జూనియర్ అసిస్టెంట్ ఆఫిస్ లో నే లెటర్ ప్రిపేర్ చేసి ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.ప్రభుత్వ భూమి ప్రజా సంక్షేమానికే ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడే విధంగా చూడాలిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ కి టి ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వినర్ ఇటిక గోపి మాదిగ లెటర్ ఇవ్వడం జరిగింది. అనంతరం "ప్రజా ప్రశ్న" దినపత్రిక తో జరిగిన విషయం వెల్లడించారు.ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో ఉన్న హస్మత్ పేట్ విలేజ్ సాయి సాగర్ ఎన్ క్లూ వద్ద సర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమి,నిషెధిత జాబితా 22ఏ లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు, రిజిస్ట్రేషన్ చేయకూడని, అలాగే క్రయ విక్రయాలు చేయ కూడదు,ప్రభుత్వ నిబంధనలు,కోర్టు నిబంధనలు ఉన్నా. భూమిలో బహుళ అంతస్తుల భవనం నిర్మాణం రాయల బిల్డర్,డెవలపర్స్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమిలో.సర్వే నెంబర్ 9 లో సర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమి కలుపుకోని రాయల బిల్డర్,డెవలపర్స్ ఒక బహుళ అంతస్తుల భవనం నిర్మాణం చేపడుతున్నారని గోపి తెలిపారు.ఈ భవన నిర్మాణం కోసం రాయల బిల్డర్,డెవలపర్స్ జిహెచ్ఎంసి అధికారులకు స్థలం సర్వే నెంబర్ 4,8,9, లో ని ప్లాట్స్ స్థలంగా ధృవ పత్రాలు చూపుతూ భవన నిర్మాణం అనుమతులు తీసుకొని భవన నిర్మాణం చేస్తున్నారు.జిహెచ్ఎంసి అధికారులు ఈ భవనం జరుగుతున్న స్థలం నిర్ధారణ వివరాలు బాలానగర్ మండల్ ఎమ్మార్వో అధికారులను కోరగా,ఈ భవన నిర్మాణం సర్వే నెంబర్ 1, 9, లో జరుగుతున్నట్లుగా అధికారులు నివేదిక ఇచ్చిన విషయం తెలిపారు.

### నిషేధిత స్థలంలో నిర్మాణాలు, పట్టించుకోని బాలానగర్ మండల్ అధికారులు..

సర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమి,ర్కర్ నిషేధిత జాబితా 22ఏ, సిఎస్ 14/58 లో ఉంది.ఈ భూమిలో జరుగుతున్న భవన నిర్మాణ చర్యలు తక్షణమే నిలుపి చేయాలని రాయల బిల్డర్, డెవలపర్స్ కి బాలానగర్ మండల్ అధికారులు తెలియజేశారు.సర్వేయర్, మండల్ గిర్దవార్ కలిసి నివేదిక గత నెల జూన్,2026 లో ఇవ్వడం జరిగింది.సర్వే నెంబర్ 1 లో స్థలం నిషేధితం,22ఏ జాబితాలో ఉన్నప్పటికీసర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమి అని ప్రభుత్వ రికార్డులలో ఉంది.చాలా కేసులు పెండింగ్లో ఉన్నాయి అని,ఈ భూమి నిషెధిత 22ఏ జాబితాలో ఉంది.ప్రభుత్వ భూమి నిషెధిత 22ఏ,జాబితాల్లో ఉన్న సర్వే నెంబర్ 1,ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి సర్వే నెంబర్ 4,8,9, లో భవన నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని భవన నిర్మాణం చేస్తున్నారని ఇటుక గోపి పేర్కొన్నారు.

### అక్రమార్కుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని గోపి డిమాండ్..

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో ఉన్న హస్మత్ పేట గ్రామంలోని సర్వే నెంబర్ 1 లో జరుగుతున్న నిర్మాణాన్ని తక్షణమే జిహెచ్ఎంసి అనుఓతులు రద్దు చేయాలి,భవన నిర్మాణం పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటూ.అధికారులకు సర్వే నెంబర్ 4,8,9, లో భవన నిర్మాణం చేస్తున్నాము అంటూ తప్పుడు సమాచారంతో అనుమతులు తీసుకొని ప్రభుత్వ నిషేధిత 22ఏ జాబితాల్లో ఉన్న సర్వే నెంబర్ 1, లో ఉన్న భూమిలో భవన నిర్మాణం చేస్తున్న వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి,భవన నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ అక్రమంగా ప్రభుత్వ స్థలం కబ్జా చేసి బహుళ అంతస్తుల భవన నిర్మాణం తొలగించాలని టి ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి డిమాండ్ చేశారు.ఒక వేళఅధికారులు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు కార్యాచరణ త్వరలో వెల్లడిస్తామని ఆయన అన్నారు.

## తండ్రి శవపేటిక చూసి భోరున విలపించిన కుమారులు

- అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాల
- కార్యక్రమాలకు దూరంగా కొత్త అధినేత మొజ్తబా ఖమేనీ
- యుద్ధం కారణంగా వాయిదా పడి ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమాలు



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హతమైన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు టెహ్రాన్‌లో కొనసాగుతున్నాయి. ఆదివారం లక్షలాది మంది ప్రజలు టెహ్రాన్ వీధుల్లోకి, గ్రాండ్ మొసల్లా కాంప్లెక్స్‌లోకి తరలివచ్చి తమ ప్రియతమ నేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "డెత్ టు అమెరికా", "డెత్ టు ఇజ్రాయెల్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. జులై 4న ప్రారంభమైన ఈ అంత్యక్రియల కార్యక్రమాలు ఆరు రోజుల పాటు కొనసాగి, జులై 9న మషద్‌లో ఖననంతో ముగుస్తాయి. టెహ్రాన్‌లో జరిగిన ప్రార్థనల్లో ఖమేనీ ముగ్గురు కుమారులు మొస్తఫా, మీసమ్, మసౌద్‌తో పాటు ఉన్నతాధికారులు, సైనిక ప్రముఖులు పాల్గొన్నారు. తండ్రి శవపేటికను చూసి కుమారులు కన్నీటిపర్యంతమయ్యారు. 36 ఏళ్లు ఇరాన్‌ను పాలించిన ఖమేనీ, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధంలో జరిగిన తొలి దాడుల్లో తన కుటుంబ సభ్యులతో సహా హతమయ్యారు. యుద్ధం కారణంగా మార్చిలో జరగాల్సిన ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అమలవుతున్న కాల్పుల విరమణ నేపథ్యంలో వీటిని తిరిగి ప్రారంభించారు. అయితే, ఖమేనీ రెండో కుమారుడు, ఆయన తర్వాత ఇరాన్ మూడో సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఈ కార్యక్రమాలకు హాజరుకాలేదు. ఫిబ్రవరిలో జరిగిన దాడుల్లో ఆయన గాయపడినట్లు, భద్రతా కారణాల దృష్ట్యా ఆయన బయటకు రావడం లేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ మళ్లీ దాడి చేయవచ్చనే ఆందోళనల నడుమ ఆయన కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారు. ఈ అంత్యక్రియలు ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన కొనసాగింపును, ఐక్యతను చాటే రాజకీయ ప్రదర్శన అని విశ్లేషకులు భావిస్తున్నారు. పటిష్ఠ భద్రత నడుమ జరుగుతున్న ఈ కార్యక్రమాలకు పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. రానున్న రోజుల్లో మరిన్ని ఊరేగింపుల తర్వాత మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఖమేనీ భౌతిక కాయాన్ని ఖననం చేయనున్నారు.

## గ్యాస్ సరఫరాపై అత్యవసర ఆంక్షలు ఎత్తివేత

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సహజవాయువు సరఫరాపై విధించిన అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పశ్చిమాసియా నుంచి హార్ముజ్ జలసంధి ద్వారా ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ) రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఈ మేరకు 'నేచురల్ గ్యాస్ (సరఫరా నియంత్రణ) ఆర్డర్, 2026'ను సవరించినట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హర్మ్యూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్‌జీ నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సరఫరా సంస్థలు 'ఫోర్స్ మేజర్' ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది మార్చి 9న కేంద్రం అత్యవసర నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దేశీయ గ్యాస్, దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని గృహ అవసరాల (పీఎన్‌జీ), రవాణా రంగం (సీఎన్‌జీ), ఎల్పీజీ ఉత్పత్తి, ఎరువుల కర్మాగారాల వంటి కీలక రంగాలకు మాత్రమే కేటాయించింది. పెట్రోకెమికల్స్, విద్యుత్ ప్లాంట్ల వంటి ప్రాధాన్యత లేని రంగాలకు సరఫరాలో కోతలు విధించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో కాల్పుల విరమణ అమలు, శాంతి చర్చలు జరుగుతుండటంతో పరిస్థితులు చక్కబడ్డాయని, సముద్ర మార్గంలో రవాణా సాధారణ స్థితికి చేరుకుందని మంత్రిత్వ శాఖ వివరించింది. అందుకే, అత్యవసర చర్యలు ఇక అవసరం లేదని పేర్కొంది. సంక్షోభ సమయంలో విధించిన మూడు అత్యవసర నిబంధనల్లో ఇది చివరిది. ఇప్పటికే రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలన్న ఆదేశాలను, బల్క్ డీజిల్ అమ్మకాలపై ఆంక్షలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాజా నిర్ణయంతో పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, ఇతర వినియోగదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఇకపై గ్యాస్ కేటాయింపులు సాధారణ వాణిజ్య ఒప్పందాల ప్రకారం కొనసాగుతాయి.

# పాఠశాలా.? పుస్తకాల దుకాణమా.?

### అనుమతులు లేకుండానే విక్రయాలా.?

- మేడ్చల్ సెయింట్ క్లారెట్ స్కూల్‌పై ఆరోపణలు
- చూస్తూ ఊరుకుంటున్న విద్యాశాఖ అధికారులు.?
  ఎం యు ఓ కనుసైగల్లో దందా.? చర్యలు ఎప్పుడంటూ తల్లిదండ్రుల ప్రశ్న
- తల్లి దండ్రులను ఒకే కేంద్రం నుంచి
  కొనుగోలు చేయాలనీ ఒత్తిడి చేస్తున్నారా.?
- నిబంధనలు ఉల్లాఘించిన డీఈవో చర్యలు తీసుకోరా.?











మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు తదితర విద్యా సామగ్రి విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్ ఫీజులు, వార్షిక ఫీజులు భారీగా వసూలు చేసిన అనంతరం, ఇప్పుడు పుస్తకాలు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులపై మరోసారి ఆర్థిక భారం మోపుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలు ప్రారంభమై దాదాపు మూడు వారాలు గడుస్తున్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఇలాంటి వ్యవహారాలపై విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు సమగ్ర తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. నిబంధనలు అమలు కావాల్సిన చోట నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.తల్లిదండ్రులకు ఒకే చోట నుంచి పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నారా.? ఈ విక్రయాలకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా.? జీఎస్టీ, వాణిజ్య, విద్యాశాఖ నిబంధనలు పాటిస్తున్నారా.? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే గుర్తింపును కూడా రద్దు చేయాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.





### ఎంఈఓ, డీఈవో చర్యలు తీసుకోరా.?

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో ప్రైవేటు పాఠశాలలో యదేచ్ఛగా పుస్తకాలు అమ్ముతుంటే స్థానిక ఎంఈవోలు వాళ్లతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు కనిపిస్తున్నాయి. ఎంఈఓ ల కనుసైగల్లోనే విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోతుందని దానికి కొంతమంది డీఈవోలు సహకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఉంటున్నాయి. డీఈవోలు కఠినంగా వ్యవహరించి ఇలాంటి పాటశాలపై చర్యలు తీసుకుంటే కొంతవరకైనా తల్లిదండ్రుల దోపిడీని అరికట్టవచ్చని కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588